విడి ప్రతి రూ. 15/-

సెప్టెంబర్ 2011

# స్పందన

ఆధ్యాత్మిక మాసపత్రిక



ఈ చిన్నవారిలో ఒకనినైనను తృణీకరింపకుండ చూచుకొనుడి
వీరి దూతలు, పరలోకమందున్న నా తండ్రి ముఖమును
ఎల్లప్పుడు పరలోకమందు చూచుచుందురు.

మత్తయి 18:10

# విజయవాడలో జరిగిన "ఆరార్కే గారి ఆత్మీయ నివాళి" సభ



1976 - 2011
35
సంవత్సరాలుగా
దేవుని అపార కృపలో

# స్పందన
ఆధ్యాత్మిక మాసపత్రిక

*The largest circulated Telugu Christian monthly since 35 years*

సెప్టెంబర్ 2011 | సంపుటి 35 | సంచిక 9

వ్యవస్థాపకులు
పరమపదించిన
**ఆచార్య ఆరార్కే మూర్తి**
ప్రచురణకర్త, సంపాదకులు
**డా॥ దేవసహాయం దండల**
గౌరవ సలహాదారులు
**ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి**
సహకారం
**పాస్టర్ పి. సురేశ్ బాబు**
సంపాదక వర్గం
**బ్రదర్ కె. పరమానందం, బ్రదర్ ఎన్. దేవానంద్, బ్రదర్ ఆర్. ఎలూజై, రెవ. కె. జాన్ మోజెస్, శ్రీమతి ఎన్. లిల్లీ భాస్కర్**
సహాయ సంపాదకులు
**బ్రదర్ డి. ఎఫ్రాయిం, బ్రదర్ డేవిడ్**

## ఈ సంచికలో..

| | |
|---|---|
| యేసు నాలో... | 6 |
| ఆధ్యాత్మిక వీరుడు | 8 |
| విశ్వసించువాడు.. | 10 |
| జయం మనదే | 12 |
| పవిత్రభూమి యాత్ర | 14 |
| కొత్త కాపురం | 17 |
| మారిన జీవితాలు | 18 |
| ప్రకటన గ్రంథం | 20 |
| సర్వోత్తమమైన మార్గం | 22 |
| బైబిల్ ప్రత్యక్షత | 28 |

మా అడ్రస్
**స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక**
**51-4-12, ఇ.ఎస్.ఐ హాస్పటల్ రోడ్,**
**గుణదల, విజయవాడ - 520 004,**
*E-mail: spandana1976@gmail.com*

సర్క్యులేషన్, పుస్తకాలు, సిడిల కోసం ఫోన్స్ :
**0866- 2456547, మొబైల్: 9490 11 3300**

సభలు, ప్రత్యేక విషయాలు, అత్యవసర ప్రార్ధనల కోసం
మాత్రమే డా॥ దేవ, సెల్. 994 833 5222

## చందా వివరాలు

| | స్వదేశంలో | విదేశాల్లో |
|---|---|---|
| 1 సంవత్సరం | ₹ 150 | $ 20 |
| జీవిత సభ్యత్వం | ₹ 2000 | $ 200 |
| పోషక సభ్యత్వం | ₹ 150 (ప్రతినెల) | $ 20 |

### ప్రత్యేక మనవి

అందరికీ చందా అందుబాటులో ఉండాలని 150 రూ.లుగా ఉంచాము. వాస్తవానికి సుమారు 200 రూ.లు పైగా ఖర్చవుతుంది గనుక 200 రూ.లు పంపగలిగిన వారు, కానుకలు పంపగలిగిన వారు ఈ సేవకోసం ప్రార్ధించి, ప్రభువు మిమ్మును ప్రేరేపించినట్లు సహకరించాలని మనవి. ఇప్పటికే ఈ సేవలో ఆర్ధికంగా సాయపడుతున్నవారికి మా ప్రత్యేక వందనాలు. మీరు పంపే చెక్కులు, డ్రాఫ్టులు, యం. ఓలు స్పందన (SPANDANA) పేరు మీద పంపాలని మనవి. వెంటనే మీకు స్పందన ఆఫీసునుండి ఉత్తరం పంపిస్తాము. దేవుడు మిమ్మును దీవించును గాక!

**అకౌంట్ పేరు "స్పందన" (SPANDANA)**

ఆంధ్రాబ్యాంక్, గుణదల (బ్రాంచ్), విజయవాడ
ఆన్‌లైన్ అకౌంట్ నం. 015810100016691
ISFS Code - ANDB0000158

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,రామవరప్పాడు (బ్రాంచి), విజయవాడ
ఆన్‌లైన్ అకౌంట్ నం. 31541230212
IFSC Code - SBIN0011100

గమనిక - ఆన్‌లైన్ కానుక పంపిన వెంటనే వివరములు ఫోన్ ద్వారా గాని, SMS ద్వారా గాని మాకు తెలియజేయాలని మనవి

## స్పందన ఆఫీసుకు రావాలంటే...

విజయవాడలో, గుణదల ఇ.యస్.ఐ హాస్పటల్ రోడ్‌లో
ఉన్న పాత పంచాయితి ఆఫీసు సెంటర్‌కు రావాలి.
అక్కడ ఉన్న దేవాలయం ప్రక్కనే
ప్రగతి నివాస్ అపార్ట్‌మెంట్స్,
మొదటి అంతస్థులో రెండో ఇల్లు FF2
ఆఫీసు సమయం ఉ॥ 10 నుండి సా॥ 6 గం.

Printed, Published and owned by DEVA SAHAYAM DANDALA Printed at Spandana Offset Printers, Suryaraopet, VJA-2. Ph:2430148, For Spandana Graphics & Published from # 30-3-13, Durga Agraharam, Vijayawada




### ఆరార్కే లేని లోటు....

ప్రభువైన యేసుక్రీసు నామమున దైవజనులకు వందనాలు. ఆచార్య ఆరార్కే గారు భౌతికంగా మన మధ్య లేకపోవటం చాలా నష్టంగా తలస్తున్నాము. వారి ప్రసంగాలు వెన్నతో పెట్టిన ముద్దలవలె ఉండేవి, క్రైస్తవులకు వాక్యంలో పౌరుషం పుట్టించేవి. అలాటి నూతన ప్రసంగాలు వినలేమని ఎంతో బాధగా ఉంది. యిలాంటి దైవజనులను అనేకలను ప్రభువు లేపగలరని "ఒక్క విత్తనము చాలు అనేక విత్తనములను సృష్టించగలదని" ఆశిస్తున్నాను.

**– డి.హానోక్, దోని**

### ధైర్యపరచింది

ప్రభువునందు ప్రియమైన సహోదరులు దేవసహాయం గారికి వందనములు. స్పందన పత్రిక క్రమముగా చదువుతున్నాను. నాకు తెలియని విషయములు మీ పత్రిక ద్వారా నాకు తెలుస్తున్నాయి. మీ పత్రిక నా ఆధ్యాత్మిక అభివృద్ధికి చాలా తోడ్పడుతున్నది. అందునిమిత్తమై మీకు నా వందనములు. ప్రభువు మీ కార్యక్రమాలన్నీ అభివృద్ధి పరచునని ఆశిస్తున్నాను.

**బి.శారాఅబ్రాహం, కాకినాడ.**

### నిగూఢమైన సత్యాలు

ప్రభువునందు ప్రియులు స్పందన ఎడిటర్ గార్కి నా వందనములు అయ్యా! మీరు జులై నెల స్పందన పత్రికలో వ్రాసిన వ్యాసము "భయాన్ని జయించాలంటే" బ్రదర్.ఏసన్నగారు వ్రాసిన "దేవుని మందిరములోని ఆనందము" అనే వ్యాసము మాకు ఎంతగానో ఆశీర్వాదకరంగా వున్నాయని తెలియజేస్తున్నాము. మీకు మా వందనములు.

**యస్.యఫ్.త్యాగరాజ్, బెల్లంపల్లి**

### ఆనందం...

ప్రియమైన దేవసహాయం అన్నయ్యగారికి దేవుని పేరట వందనములు తెలుపుచున్నాను. అన్నయ్య మీరు జరుపుచున్న స్పందన అనే కార్యక్రమం మా కెంతో ఆధ్యాత్మికంగా వుంది. ఇంకా మీరు చెప్పే వాక్యం చాలా ఆనందంగా ఉంటుంది.

**వి.ప్రేమకుమార్, చీరాల**

### కన్నీరు..

జీవముగల దేవుని సేవించుచూ తన పరిచర్య చేయుచున్న దండల దేవసహాయం గార్కి ప్రభువు నామమున శుభాభివందనములు. ఆచార్య ఆరార్కే మూర్తి గారు ప్రభువులో నిద్రించినారన్న వార్త వినగానే దుఃఖముతో వున్నాను. ఆరాదన చానెల్లో మూర్తినాయనగారి గూర్చి దైవసేవకులందరు సాక్ష్యములు ప్రకటిస్తుండగా నేను చూస్తూ కన్నీళ్ళు కార్చాను. ఆచార్య ఆరార్కే మూర్తిగారి లాంటి దైవసేవకులు దండల దేవసహాయం గార్కి ఇంకా అనేకమంది తోడుగా వుండాలని ప్రభువును ప్రార్థిస్తున్నాను.

**పి.రఘురామయ్య, కర్నూలు.**

### మార్పు చెందుతున్నాము

ప్రభువునందు అతి ప్రియుమైన డా॥దేవసహాయం గారికి అనేకమైన వందనములు. మీరు మా కోసము చేయు ప్రార్థనల వలన మేమంతయు క్షేమముగా ఉన్నాము. మీరు అందించిన దేవుని వర్తమానములు ప్రతివారము టి.వి కార్యక్రమములో వినుచున్నాము. మా హృదయములు ఎంతో మార్పు చెందుయున్నవి. మీకు చక్కని స్వరము ఇచ్చి తన సేవలో వాడుకొనుచున్నందులకు దేవునికి స్తోత్రములు.

**ఎ.లాజరు, విశాఖపట్నం**

### బలపడుతున్నాము

దైవసేవకులైన డా॥దేవసహాయం అయ్యగారికి వందనములు. అయ్యగారు మీ యొక్క 'స్పందన' టి.వి కార్యక్రమములో మీరు చెప్పుతున్న వాక్యముతోను, మరియు స్పందన పత్రిక చదివి మేము ఎంతగానో ఆధ్యాత్మిక జీవితములో బలపడుచున్నాము.

**ఎ.ఫ్రాంక్లిన్, హుబ్లి.**

## ఆణిముత్యాలు

**మ**నం ఈ లోకంలో ప్రవాసులం. పరదేశులం. పరాయి వాళ్ళం. యేసు కనుసన్నల్లో బతుకుతున్నాం. పరిశుద్ధంగా నిర్దోషంగా ప్రవరిస్తాము. దేవుని కృపా మహదైశ్వర్యానికి వారసులం. మన విమోచన మూల్యం యేసురక్తం. మనం విముక్త ప్రజలం. మన అపరాధాలు క్షమించబడినవి. క్రీస్తునందు స్వేచ్ఛాజీవులం. యేసురక్త బలి ఎప్పటిది? జగత్పునాదికి ముందే వధింపబడిన దేవుని గొర్రెపిల్ల యేసే. కలువరికి ముందే, సృష్టికి ముందే ఉంది దేవుని గొర్రెపిల్ల. ఈ రోజున యేసును తిరస్కరించే వారి ద్వారా శ్రమలు ఇంకా కొనసాగుతున్నాయి.

ఆయన పిల్లల నిర్లక్ష్యమే ఆయన శ్రమల పొడిగింపు. దేవుణ్ని నిలదీసి నీవెందుకు ఇలా చేస్తున్నావు అని అడిగే వాడెవడున్నాడు? దేవుని దూతలు విశ్వాసులకు బంట్రౌతులు. మనమెంత దూరం చూడగలం? మన వీపునకు కండ్లు లేవే? అసలే ఇది చీకటి లోకం. ముందు కనబడదు. వెనుకా కనబడదు. మన ఉద్రేకాలను కూడా యేసు స్వస్థపరచాలి. మన కన్నీరు యేసురక్తంలో క్షాళితం కావాలి. ఉద్రేకాల జబ్బు నరాలకు దెబ్బ. ప్రభువే స్వస్థపరచాలి. ఎక్కడ దెబ్బ తగిలిందో సరిగ్గా అదే బిందువులో క్రీస్తు నిన్ను అద్భుతంగా స్వస్థపరిచి, అధిక బలమివ్వగలడు.

ఈ రోజుల్లో నాగరికుల జబ్బుల్లో 90 శాతం ఉద్రేక జన్యమైన మానసిక వ్యాధులే. ఆరోగ్య విషయంలో శరీరాన్ని గురించిన అతి భయం మానసిక రుగ్మతకు దారితీస్తుంది. “నాకుమారుడా, ధైర్యంగా ఉండు. నీ పాపాలు క్షమించబడ్డాయి” అంటున్నాడు యేసు. యోహాను 5.39 లేఖనాలన్నీ యేసును గురించే సాక్ష్యమిస్తున్నాయి. లేఖనాలలోని యేసులో నిత్యజీవముంది. క్రీస్తుపునాది మీద కట్టబడుతూ ఉండాలి. కొలస్సీ 2.7. దేవుని వాక్యం యేసు నీకూ, నాకూ రాసిన ప్రేమలేఖ. ఈ ప్రేమలేఖకు ప్రార్థనలో మనం స్పందించాలి. విజేతలైన విశ్వాసులే దేవునికి రాజులైన యాజక సమూహం!

క్రీస్తునందు భవదీయుడు - ఆరార్కె

### ప్రత్యేక గమనిక

***సెప్టెంబరు నెల సంచిక ఆరార్కెగారి నివాళి సంచిక అని గత నెల సంచికలో ప్రకటించాము. ఆరార్కె గారితో వారికున్న అనుభవాలు, ఆరార్కె గారితో వారు తీయించుకున్న ఫోటోలు పంపిస్తున్నారు. చాలా మంది ఇతర రాష్ట్రాల్లో, దేశాల్లో ఉన్న వారు ఆగస్టు సంచిక చాలా ఆలస్యంగా అందిందని వారు వారి అనుభవాలను రాసి పంపటానికి సమయం కావాలని కోరారు గనుక వచ్చే నెల, అక్టోబరు నెల సంచిక దైవజనులు ఆరార్కె గారి నివాళి సంచికగా ప్రచురిస్తున్నాము. మీలో ఇంకెవరైనా మీ అనుభవాలు, ఫోటోలు పంపాలంటే పంపవచ్చును.***

# మనలో మాట....

క్రీస్తునందు మాకత్యంత ప్రియులైన పాఠకులకు శుభములు వందనములు. **1 దినవృ. 22.13 'నీవు వృద్ధి పొందుదువు, ధైర్యము తెచ్చుకొని బలముగా ఉండుము. భయపడకుము, దిగులుపడకుము'** అనే దివ్య వాక్యంతో మీకు సెప్టెంబరు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

జులై 15 దైవజనులు ఆరార్కే గారు ఇక లేరు అనేవార్త మనసు వికలమైపోయింది. ఏదో తెలియని నీరసం నిస్సత్తువ మనసున చోటు చేసుకున్నాయి. నా మట్టుకు నేనెప్పుడూ ఆరార్కే ఇంత త్వరగా లోకయాత్రను ముగిస్తారని అనుకోలేదు. చిన్న, చిన్న ఆరోగ్యసమస్యలున్నా ఎంతో ఏక్టివ్‌గా ఉండేవారు. కొన్ని పెద్ద సమస్యలున్నా అనేక దేశాలు ఇద్దరమూ కలిసి ప్రయాణం చేశాము. వాక్యాన్ని ప్రకటించటం అంటే దైవజనునికి ఎంతో ఇష్టం! తన చుట్టూ పదిమంది ఉన్నా వారు ఏదో ఒక వాక్య మర్మం తెలియజేస్తూ ఉండేవారు.

ఏదిఏమైనా జీవితం అన్నాక ఏదో ఓ రోజున ఈ లోకాన్ని విడువాల్సిన వారమే! మనకున్న శుభప్రదమైన నిరీక్షణ 'శాశ్వతమైన పరలోక రాజ్యం' అక్కడ దైవజనులను మనం కలుసుకుంటాము. ***యాత్రను ముగించిన వేళ ఆరోహణమై పోవాలని... క్రీస్తు యేసుతో సింహాసనమూ పైకెగసి కూర్చోవాలని... ఇదే నా కోరిక*** అంటూ దైవజనులు రాసుకున్నారు. మనకు తెలియని ఎన్నో రహస్యాలు ఆ రోజున బయటపడతాయి.

ఆగస్టు నెలలో అనేక సేవాకార్యక్రమాల్లో నిమగ్నమై యుండటం సంతోషం కలిగించిన విషయం! సేవా కార్యక్రమాలన్నిటికోసం మీరు ప్రార్థించాలని మనవి చేస్తున్నాను.

ఆగస్టు 5 వ తేది పెదపూడిలో వివాహం జరిగింది. ప్రముఖ దైవజనులు ఇష్మాయేలు అయ్య గారి మనుమడు, రెవ. డా॥ ఇమ్మానుయేలు గారి కుమారుడు సంతోష్ వివాహం రమ్యతో తో జరిగింది. వివాహపు ప్రమాణాలు వధూవరులచేత చేయించి వివాహాన్ని జరిగించాను. వివాహాన్ని జరిగించిన తీరు దైవజనులు ఆరార్కే మూర్తి నాయన గార్ని జ్ఞాపకం చేసిందని రెవ. డా॥ సుదర్శన్ మోజెస్ గారు, రెవ. డా॥ అప్పికట్ల జాషువాగారు మరికొందరు దైవసేవకులు అభినందించారు, ఆనందించారు. నూతన వధూవరులకోసం ప్రార్థించాలని మనవి చేస్తున్నాము.

గుంటూరు జిల్లా వెల్లటూరులో ఆరార్కే గారికి నివాళి సభను పాస్టరు శ్రీకాంత్ నిర్వహించారు. ఆ సభలో వాక్యపరిచర్య చేశాను. రాజకీయ నాయకులు కూడా వచ్చి ఆరార్కే గారికి నివాళి అర్పించారు. వారిని దేవుడు దీవించాలని ప్రార్థించాము. మన పరిచర్యల తరపున ఆరార్కే గారి జ్ఞాపకార్థం ఈ ప్రాంతంలో ఉన్న కొందరు పేద విధవరాళ్లకు చీరెలు పంచటానికి ప్రభువు కృపచూపారు. ఈ సోదరీలంతా ఎంతో సంతోషించినట్లు పా॥ శ్రీకాంత్ తెలిపారు.

15వ తేది విజయవాడలోని సెయింట్ పాల్స్ ఈస్ట్‌పారిష్ చర్చిలో స్పందన మాస పత్రిక ఆధ్వర్యంలో దైవజనులు ఆరార్కే గారికి ఆత్మీయ నివాళి కార్యక్రమం సభ జరిగింది. దైవజనుని సేవాజీవితంలో అనేక విషయాలను జ్ఞాపకం చేసుకోసే ఆశీర్వాదకరమైన సమయాన్ని కలిగియున్నాము. సుమారు 500 మంది పాల్గొని ప్రభువును మహిమ పరిచారు. అందరికీ ఆరార్కే గారి 'శాకాహార భోజనం' ప్రేమవిందు జరిగింది. మరిన్ని వివరాలు టైటిల్ ఇన్నర్ పేజీల్లో ఫోటోలు మీరు చూడవచ్చును. ఆరార్కే గారి గుర్తుగా పిల్లలందరికీ నూతన వస్త్రాలు బహుకరించటానికి ప్రభువు కృపచూపారు.

21వ తేది విజయవాడలోని మధురానగర్‌లో నిత్యసువార్త ప్రార్థనా మందిరంలో ఆరార్కే గారి జ్ఞాపకార్థ జరిగింది. పా॥ నరసింహారావు గారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారి పిల్లలు పా॥ మోహన్, పా॥ రవి కుమార్, పా॥ స్వర్గరాజ్యం ఆరార్కే గారి పాటలు ఏర్చికూర్చి చక్కని గాలాపాన చేశారు. సంఘమంతా ఆ పాటలు పాడుతూ ఉంటే పరలోకపు గానాలు గుర్తొచ్చాయి. దేవుని వాక్యాన్ని, ఆరార్కే గారి కొన్ని తీపి గుర్తులను నేను పంచుకున్నాను. శ్రీ యస్వీ శేషగిరిరావు గారు ఆరార్కే

గారితో ఉన్న అనుబంధాన్ని మరోసారి గుర్తుచేస్తుకున్నారు.

25వ తేది. ప॥ గోదావరి జిల్లా నరసన్నపాలెంలో బాబుగారి ఆధ్వరంలో ఆరార్కే గారి జ్ఞాపకార్థసభలో వాక్య పరిచర్య చేశాను. పా॥ దియ్యా ప్రసాదరావు, పా॥ బియస్ రావు, సాయంత్రం సభలో పా॥ యేసు పాదాలు గాన పరిచర్య చేసి ప్రభువును మహిమ పరిచారు. పాస్టర్ బాబు గారి పేరు దైవజనులు ఆరార్కే గారు 'యేసు దర్శనరాజు' అని మార్చారు. దాదాపు 15 సంఘాలు వీరి ఆధ్వర్యంలో ప్రతి వారం ప్రభువును స్తుతిస్తూ ఉంటారు. ఈ సంఘాలు దైవజనులు నన్ను ప్రేమించే విధానం అంతా ఇంతా కాదు. సోదరులు పా॥ పీటర్ గారు, బ్రదర్ ప్రసాదరావు గారు మాకు ఎంతో ప్రేమతో ఆతిధ్యమిచ్చారు. స్పందన పరిచర్యలను ప్రేమించే ఈ ప్రియులందరికోసం మీరంతా ప్రార్థించాలని మనవి. చాలా సార్లు మా పాఠకులకు నేను తెలియజేసినట్టు గ్రామాల్లో సేవంటే నాకెంతో ఇష్టం. అందుకే గ్రామాల్లో సువార్త సభలు, సేవకులకు తర్ఫీదు తరగతులు, గ్రామాల్లో మందిరాలు మన పరిచర్యల ద్వారా జరిగింస్తుంటాము. ముగింపులో చిన్న ధ్యానం.

**ప్రియ పాఠకులారా మన వ్యక్తిగత ఆధ్యాత్మిక జీవితాలను చాలా జాగ్రత్తగా ఉంచుకోవాల్సిన రోజులివి. దేవుని విషయాల్లో అవిశ్వాసివి కాకు! అపనమ్మకం రానీయకు! నీవు విశ్వాసివని గుర్తుంచుకో!**

**హెబ్రీ 11. 6 దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన ఉన్నాడని.... నమ్మాలి** ఈ వచనాన్ని మీరు జాగ్రత్తగా గమనిస్తే దేవుడు ఉన్నాడని నమ్మాలి. దేవుడు ఎలా ఉన్నాడని, ఏమి చేయగలడని నీవు నమ్ముతావో అది నీకవుతాడు. వాక్యంలో మనం చదివే మాట **'నమ్మే వానికి సమస్తమూ సాధ్యము.' మార్కు 9.23** నీవు నమ్మితే...

***బలహీనతలో నీ బలమౌతాడు***

***అనారోగ్యంలో నీకు ఆరోగ్యమవుతాడు***

***బుద్ధిహీనతలో నీ జ్ఞానమవుతాడు***

***అన్నీపోయినపుడు ఆయన అన్నీతానవుతాడు***

***దారులన్నీ మూసుకపోయినపుడే ఆయన "నేనే ద్వారమును" అంటాడు.***

నీవు ఎంతవరకూ నీ ప్రభువును నమ్మి వెంబడిస్తావో అంతవరకూ ఆయన నిన్ను నడిపిస్తాడు. మనలో చాలా మంది దేవుని శక్తిని ఒక విషయంలోనే అనుభవించారు. మనకు ఆయన రక్షకుడుగా తెలుసు! చాలా సంతోషం, అది ప్రాముఖ్యమైనది. కాని అంతటితో ఆగిపోకు! యేసయ్యలో ఉన్న ఆశీర్వాదాలన్నీ నీవు సంపూర్ణంగా అనుభవించాలి.

యేసయ్య, నీవు పునరుత్థానుడైన దేవుడిగా నీకు తెలుసా? చచ్చినలాంటి పరిస్థితులను సహితం ఆయన బ్రతికించగలిగిన దేవుడని నీకు తెలుసా? ఎఫెసి 3.20 **'అడుగువాటికంటే, ఊహించేవాటి కంటే అత్యధికంగా ఇచ్చే దేవుడు'** దేవుడుగా ఆయన నీకు తెలుసా? ఆయన స్వస్థపరచే దేవుడని నీకు తెలుసా? **యెషయా 61.3 – బూడిదకు ప్రతిగా పూదండను ఇచ్చే దేవుడని నీకు తెలుసా?** 61.7లో అవమానానికి ప్రతిగా రెట్టింపు ఘనతను ఇచ్చే దేవుడని నీవు నీ అనుభవంలో గుర్తించావా?

చాలా సార్లు మన జీవితాల్లో మనసు గాయపడిన పరిస్థితులు, నిరుత్సాహానికి గురయిన పరిస్థితులు, నీవు నమ్మిన వారే నీకెంతో కీడు చేశారు. అయితే ఒక్క విషయం గుర్తుంచుకో! ఈ విషయాలన్నీ తలపోస్తూ సైతానుకు మీ జీవితాల్లో, కుటుంబాల్లో తావిచ్చి ఓడిపోయిన జీవితాన్ని, నీ పరిస్థితికి నీవు జాలిపడుతూ కృంగిపోయిన జీవితాన్ని, జీవించవద్దు. దేవుడు నీ మనసుకు తగిలిన ప్రతి గాయాన్ని మాన్పాలని కోరుతున్నాడు. ఆయన నీకు నూతన ఆరంభాన్నివ్వాలని కోరుతున్నాడు. యెహెజ్కే 36.11 మునుపటికంటే అధికమైన మేలులు మీకు చేయాలని ఆశిస్తున్నాడు గనుక ఆ దేవుని శక్తిని పూర్తిగా అనుభవించాలనే కోరిక నీకుండాలి.

పాఠకులారా, మన దేవుడు సర్వశక్తి సంపూర్ణుడు, ఆయన సర్వాంతర్యామి. నీ కొద్ది విశ్వాసంతో దేవుణ్ని ఓ చిన్న పెట్టెలో బంధీ చేయకు. దేవుడు ఇంతమటుకే చేస్తాడు, చేయగలడు అనే వేదాంతంలోనికి రాకు. నమ్మేవానికి సమస్తమూ సాధ్యమే! దైవాశీస్సులు.

ప్రభువు సేవలో మీ సోదరుడు దేవ దండల



ఆచార్య ఆరార్కే

# యేసు నాలో నేను యేసులో

**మ**త్తయి 28.18. యేసుప్రభువు తన శిష్యులను ఉద్దేశించి ఆజ్ఞాపించాడు. **"పరలోకమందు, భూమి మీద నాకు సర్వాధికారము ఇవ్వబడి ఉన్నది. మీరు వెళ్ళండి, సమస్త జనులను నాకు శిష్యులుగా చేయండి"** ప్రభువు తన అధికారాన్ని విశ్వాసులతో పంచుకున్నాడు. లూకా 10.19. విశ్వాసుల ప్రార్ధన బలం.... యేసుక్రీస్తు యొక్క రక్త నిబంధన. దేవుడు తన ప్రేమ సందేశాన్ని సిలువ మాను మీద చెక్కాడు.

దేవుడికి మానవత పై ఎంతో ప్రేమ. ఈ రోజువరకు కూడా యేసు మానవుడుగా ఉండటం మానలేదు. యెషయా 43.4. **"నీవు నా దృష్టికి ప్రియుడివైనందు ఘనుడివయ్యావు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను".** వ్యక్తిగతంగా నిన్ను బహుగా ప్రేమిస్తున్నాడు. నీవొక్కడివే తనకున్నట్లు అంతగా ప్రేమిస్తున్నాడు. ప్రార్ధన ద్వారా మనకు ఘనవిజయం. సైతానును జయించటానికి ఇదే బలమైన ఆయుధం. సిలువలో అంతా అయిపోలేదు. మనం మహావిజేతలం. అత్యధిక విజయం మనది. యేసు సిలువ విజయ సంకేతం.

### కవల సత్యం

ఇంత గొప్ప ప్రభువు నా పక్షాన ఉండగా దిగులు దేనికి? భయమెందుకు? శరీరము, ఆత్మ.. ఆత్మ జీవింపజేస్తుంది. చావునకు లోనైన ఈ శరీరాన్ని మనలో నివసించే పరిశుద్ధాత్మే జీవింపచేస్తాడు. విశ్వాసిలో నివసించే ఆత్మవల్ల మనకు మహిమ నిరీక్షణ. క్రీస్తు మన హృదయంలో జీవిస్తున్నాడు. మరోమాట యెషయా9.6 ఏమంటోంది? మనకు శిశువు పుట్టాడు. మనకు కుమారుడు అనుగ్రహింపబడ్డాడు. అనగా పరలోకములోని కుమారుడు ఇక్కడ శిశువుగా పుట్టాడు. కుమారుడు ఇవ్వబడ్డాడు. శరీరాన్ని జయించాలి. లోకాన్ని ఏలబోయే ప్రభువు ఇప్పుడు నీలో నాలో ఉన్నాడు. జీవించేది నేను కాదు, క్రీస్తే నాలో జీవిస్తున్నాడు. యేసు ఎంతైనా విశ్వసనీయుడు. చీకటిలో నడిచే ప్రజలు గొప్ప వెలుగు చూస్తారు. చావు నీడలు కమ్మిన దేశ నివాసుల మీద ప్రకాశించే విశ్వాసులు "బల్బు"లు. యేసునాలో నేను యేసులో – అనేది "Twin Truth" కవల సత్యమిది. ఈ రెండూ క్రైస్తవ ఉద్యమానికి స్ఫూర్తి! కన్యక గర్భధారణ అనేది యేసావతార సంకేతం. యోహాను 10.30 యేసు ఉవాచ. నేను తండ్రి ఏకమై ఉన్నాము. యేసు శరీరంలోనికి పరిశుద్ధాత్మ మనల్ని ప్రవేశపెట్టాడు. యేసు సార్వత్రిక శరీరంలో విశ్వాసులం మనమందరం సాటి అవయువములం. యేసుకు ఏ విశ్వాసీ వేరై ఉండడు.



## విశ్వాసిలో యేసు

యేసు రారాజు, మహాచక్రవర్తి, ఆశ్చర్యకరుడు. పారలౌకిక ఆలోచనలకు ఆయనే మూలం. బలశాలి, నిత్యుడు, సమాధాన కర్త. ఆయన మానవునికి, దేవునికి ఏకైక మధ్యవర్తి. యేసు రాజ్యం సుభోజ్యం. శ్రేయోరాజ్యం. యేసు రాజ్యంలో యుద్ధ ఖడ్గాలు నాగటి నక్కులవుతాయి. ఈటెలు మచ్చు కత్తులవుతాయి. యేసు మహాత్యాన్ని గురించిన జ్ఞానంతో భూమి నిండి పోతుంది చూడండి. యేసునామం దేవుని పిల్లలందరికి వారసత్వంగా సంక్రమిస్తుంది. **యేసు విశ్వాసిలో నిలిచి ఉంటాడు. అలాగే విశ్వాసి యేసునందు నిలిచి ఉంటాడు.** ఇది అద్వైత భావన.

## విశ్వాసి జీవం క్రీస్తుతో

విశ్వాసి జీవం క్రీస్తుతో కూడా దేవుని యందు దాచబడి ఉంది. "సేఫ్టీలాకర్". కొలస్సీ 3.3. యేసుక్రీస్తు విరాట్పురుషుడు. అనంతుడు. విశ్వకర్త. విశ్వబ్రహ్మ, సృష్టికర్త, విశ్వవ్యాపి, పరమాత్మ, జగద్రక్షకుడు, తేజోమయుడు, తేజస్సులో ఉన్నవాడు. క్రీస్తునందే అమర్త్యత, అమృతసిద్ధి! సమస్త ప్రజలారా నాలోకి రండి విశ్రమించండి. అబ్రహాము నుండి జాతీయ ఆశీర్వాదం పాలస్తీనా భూమి. భౌగోళిక ఆశీర్వాదం. దావీదు రాజ్యం! చివరికి విశ్వాసి హృదయంలోకి అన్నీ వచ్చేశాయి.

## దేవుని రాజ్యం విశ్వాసితో

దేవుని రాజ్యం ప్రతి విశ్వాసి హృదయంలోనే ఉంది. ఆయన మన రాజు, యజమాని, కర్త, భర్త. యేసుక్రీస్తు పూర్తిగా దేవుడు, పూర్తిగా మానవుడు. ఫిలిప్పి 4.13 పౌలు ఉవాచ. నన్ను బలపరిచే క్రీస్తునందే నేను సమస్తమూ చేయగలను. 1పేతురు 1.14 యేసు ఉవాచ. నేను పరిశుద్ధుణ్ని మీరు అలాగే పరిశుద్ధులై ఉంటారు. అంతరంగికమైన మార్పు బహిర్గతమైన సంస్కరణ అవుతుంది. లూకా 6.31. విశ్వాసి జీవితంలో ముఖ్యమైన జీవన సూత్రం.

## పాపరోగానికి విరుగుడు

నీకు నీవే చెప్పుకునే అబద్ధం చాలా ప్రమాదకరమైనది. ఇదొక నానుడి. దేవుని వాక్యం దేవుడితో ఆరంభమవుతుంది. "ఆది యందు దేవుడు" వాక్యమూ, దేవుడూ.. ఒకటే. "ఎలోహీం" దేవుడు. తండ్రి కుమార పరిశుద్ధాత్మలు ముగ్గురూ ఒక్కటే. ఒకరే. యేసుప్రభువు మంచి కాపరి. యేసే వాక్యమై గొర్రెలతో మాట్లాడతాడు. గొర్రెలు తన కాపరి స్వరం వెంటనే గుర్తుపడతాయి. ప్రభువు ఓ సందర్భంలో పిలిప్పుతో అన్నాడు. "నన్ను చూచిన వాడు తండ్రిని చూచినట్టే! నేనూ, నా తండ్రీ ఒక్కటే అన్నాడు యేసు. ప్రతి మనిషిలో పాపం, పాపస్వభావం ఉంది. అది హృదయానికి పట్టిన పాపరోగం. మరణానంతరం నరకానికి దారితీసేది పాపరోగం.

యేసుక్రీస్తునందు విశ్వాసమే పాపారోగానికి విరుగుడు మందు. కల్వరిపై యేసు కార్చిన రక్తమే పాపరోగానికి చికిత్స. యేసు ఉవాచ. "నా పక్షమున ఉండని వాడు నాకు విరోధి. నాతో కలిసి సమకూర్చనివాడు చెదరగొట్టేవాడే" దమస్కు మార్గంలో సౌలు యేసును కలుసుకున్నాడు. సౌలు అడిగాడు. ప్రభూ తమరెవరు? యేసు అన్నాడు. "నీవు హింసించే యేసును" సౌలు క్రైస్తవులను హింసిస్తున్నాడంటే క్రీస్తునే హింసించినట్లు. తన బిడ్డల బాధలో యేసుకూడా బాధ చెందుతాడు. విశ్వాసి తన కంటి గుడ్డుతో సమానం. యేసంటే ఎవరనుకున్నావు? సర్వమూ యేసునుంచే సృజించబడింది.

## ముగింపు

దృశ్యా దృశ్య జగత్తు, చరాచర జగత్తు ఆయన సృష్టే. కొలస్సీ 1.16. సింహాసనాలు, ప్రభుత్వాలు, అధికారాలు అంతా అన్నీ ఆయన సృష్టే. సర్వమత సమ్మేళనం అని కొత్త మతం వచ్చింది. వారేమంటారంటే "అంతా ఒకటే, అన్ని మతాలు ఒకటే. ఎవరిమతం వారికి మంచిది. అంచేత అన్నీ మంచివే". రకరకాల విశ్వాసాలను గోతములో వేసి మూటగడదామని వీరి ప్రయత్నం. యేసుప్రేమ మత ప్రమేయం లేనిది. ఆయన ప్రేమ విమోచనాత్మకమైనది. ఏ మతం కావాలో కొరుకో అనికాదు. ఇద్దరిలో ఎవరు కావాలో కోరుకో. యేసా, సైతానా? సైతానులో సత్యం లేనే లేదు. వాడు అబద్ధికుడు, అబద్ధానికి జనకుడు. యేసే మనకు జ్ఞానము, నీతి, పరిశుద్ధత, విమోచనము. యేసు లేని వాడికి ఎన్ని మతాలున్నా, మార్గాలున్నా వుద్ద దండుగ. యేసును కలిగినవాడికి ఏమి లేకపోయినా, చివరికి మొలపై గుడ్డ లేకపోయినా వాడికి పరలోక జీవం ఉంది. అంతే ఆమేన్!



**- డా॥ దేవ దండల**

# ఆధ్యాత్మిక వీరుడు

**దే**వుని నేత్రాలు భూమి అంతా పరీక్షిస్తున్నాయి. అంటే ఆయన ఘననామం నేడు అపకీర్తి పాలయ్యేచోట దానికి ఘనకీర్తులు కలిగించే వారికోసమే! అలాంటి ఆధ్యాత్మిక వీరుల కోసమే ఆయన నేత్రాలు అన్వేషిస్తున్నాయి. అంధకార శక్తులు అణగద్రొక్కడానికి, ఆయన నామ ఘన ప్రభావాన్ని అన్యజనులందరికీ ప్రచురపరచడానికి ఎన్నో శతాబ్దాలుగా దేవుడు కొంతమందిని మాత్రమే వాడుకుంటున్నాడు. వారిలో మన ప్రియులు ఆరార్కోగారు ఒకరు. ఎంతోమంది అసంఖ్యాక ప్రజానీకం దైవాశీస్సులు పొందగలిగారు.

“వారి (అన్యుజనుల యెదుట) మీ యందు నేను నన్ను పరిశుద్ధపరచు కొనగా నేను ప్రభువగు యెహోవానని వారు తెలిసికొందురు.” యెహెజ్కేలు 36:23

ఈ సందేశంలో ఒక వాగ్దానం వుంది. అది షరతులు గల వాగ్దానం. ఎలీషా మన వంటి స్వభావోద్రేకాలు గలవాడే కాని అతని వలన అప్పటి తరపు ప్రజల మీద దైవ ప్రభావం వుంది.

## దైవజనుడు

“మన యొద్దకు వస్తూ పోతున్నవాడు భక్తిగల దైవజనుడని నేనెరుగుదును” 2 రాజులు 4:8-9. ఎలీషా దైవజనుడని ఎలా గుర్తించింది? వేషాన్ని చూచి మోసపోయే వ్యక్తికాదామె. ఎలీషా ఆమె గృహాన్ని తరుచుగా దర్శిస్తూ వుండేవాడు. అతన్ని పరిశీలిస్తూ వుండేది. చివరికి ఎలీషా పరిశుద్ధుడైన దైవజనుడని దృడ నిశ్చయానికి ఆమె వచ్చింది.

ఇరుగూ పొరుగు మనల్ని పరిశీలిస్తున్నప్పుడు మనమీద వారికి ఈ విధమైన సదాభిప్రాయం కలుగకపోతే మనం ఏం చెప్పినా, ఏం చేసినా, అంతా వృధాయే! మన హృదయాల్లో మొదటినుంచి మనం ఏ విధంగా అవ్వాలని కోరుకుంటామో, ఆ విధంగా తయారౌతామనేమాట సత్యదూరం కాదు. దేవుడు మనల్ని తన సేవలో వాడుకోవాలనే ఉద్దేశ్యంతో మాత్రమే మనం పరిశుద్ధత పాటిస్తే అది స్వార్ధపూరితమైన ఉద్దేశం అవుతుంది. దేవుడు మనల్ని వాడుకొన్నా, వాడుకొనక పోయినా ఆయన పరిశుద్ధుడు గనుక మనం కూడా పరిశుద్ధతను పాటించాలి.

దైవజనుడైన ఎలీషా పర్యటనలో అతన్ని కలిసికొన్న వారందరకీ అతడు పరిశుద్ధుడైన దైవజనుడనే ఏకాభిప్రాయం కలిగింది. అతని సందేశాలు, అతని బోధలు ప్రజలు గుర్తుపెట్టుకోక పోయినా అతని జీవిత ప్రభావాన్ని మాత్రం వారు మరువలేక పోయారు. అలాంటి జీవిత ప్రభావం మన జీవితాలపై పడితే అది మన జ్ఞప్తిపథం నుండి ఎన్నడూ చెరిగిపోదు.

దేవుడు తన వాక్యం ప్రకటించడానికి ఒక సేవకుని వాడుకుంటున్నాడంటే అది కేవలం అతనిపై ఆయన కనికరమే! ఆయన వాక్యం వినే ప్రజలపై ప్రేమయే కారణం. అచంచలమైన, అనంతమైన దైవ సంఘ నిర్మాణానికి దేవునికి



సహకారులుగా వుంటూ వ్యక్తిగత ఆత్మ యుద్ధంలో నుండి పోరాడే బహుకొద్దిమందిలో మనం శేషితజనంగా వుండాలంటే తప్పక పరిశుద్ధులుగా వుండి తీరాలి.

పరిశుద్ధత లోపించడానికి మూడు కారణాలున్నాయి. 1)కపటము 2)ఇంద్రియ నిగ్రహాలోపం 3)దైవసహవాసానికి తీరికలేకపోవడం.

**కపటము**

జీవితంలో కపటం పూర్తిగా విసర్జించడానికి హృదయపూర్వకంగా ప్రయత్నించనివాడు పరిశుద్ధ దైవజనుడు కాలేడు. మనం భక్తిగా కనిపించాలనే తాపత్రయంతో ఒప్పుకోము గాని నిజానికి ఒప్పుకోవలసిన పాపాలు మన అందరిలోనూ వుంటాయి. ఒప్పుకోకపోవడం అనే దురలవాటును మనం విడిచిపెట్టాలి. మనం ఆంతర్యంలో ఎలా వున్నామో అదే నిజ స్వరూపాన్ని బాహ్యంగా కూడా నిష్కపటంగా కనపర్చడానికి సర్వప్రయత్నాలు చేయాలి. నిజక్రైస్తవ సహవాసాన్ని ఆటంకపరచేది కపటం. మన ప్రియ ప్రభువైన యేసయ్య అన్ని పాపాలకంటే ఈ కపటవేషధారణ అనే పాపాన్ని ఎక్కువగా ఖండించేవారు. "వేషధారణ అనే పరిసయ్యుల పులిపిండిని గూర్చి జాగ్రత్తపడుడి" అని ఆయన శిష్యుల్ని హెచ్చరించారు.

"ఇతడు నిజంగా ఇశ్రాయేలీయుడు ఇతని యందు ఏ కపటం లేదు" అని నతనియేలును గూర్చి ప్రభువువారు చేసిన ప్రశంస ఎంతో గొప్పది. నిజమే! తన ఆత్మలో కపటము లేని నరుడు ధన్యుడే!

**ఇంద్రియ నిగ్రహలేమి**

ఇంద్రియాల మీద ముఖ్యంగా చెవి, కన్ను, నాలుక మీద మనకు ఎక్కువ అదుపు వుండాలని కొత్త నిబంధన చెబుతుంది. పరిశుద్ధాత్మ శక్తి వలన శరీరేచ్ఛల్ని అణుచుకోకపోతే మనం ఆధ్యాత్మిక జీవితం అనుభవించలేమని రోమా 8:13లో పౌలు చెబుతున్నాడు. మనం వినే సంభాషణల్ని గురించి మనం జాగ్రత్త వహించాలి. ఈ రోజుల్లో ఎక్కువగా మనం చూచేవి, చదివేది ఏవో మన మెళకువతో మన కండ్లను జాగ్రత్తగా వుంచుకోవాలి. కీర్తనలు 119:37. "వ్యర్థమైన వాటిని చూడకుండానా కన్నుల్ని త్రిప్పివేయుము" అని అనుక్షణం మనం దేవుణ్ణి ప్రార్థించాలి.

మన నాలుక కూడా పరిశుద్ధాత్మ సారథ్యంలో వుండటం ఎంతైనా అవసరం. దేవుని పరిశుద్ధతను యెషయా చూచినపుడు తన నాలుకను తాను ఉపయోగించిన తీరు తనకు బాధ కలిగించింది. వైద్యులు దేహమంతా చూడకుండానే సాధారణంగా మన నాలుకను చూచి మన ఆరోగ్య పరిస్థితి ఎలా వున్నదీ చెబుతారు. అలాగే పారమార్థక విషయంలో కూడా యాకోబు చెప్పినట్లు మానవుడు తన నాలుకను ఎలా ఉపయోగిస్తాడో అదే మన ఆధ్యాత్మిక (ఆరోగ్య) స్థితికి అసలైన పరీక్ష. యాకోబు 1:26; 3:2

**దైవ సహవాసలేమి**

మనం ఒంటరిగా దైవసన్నిధిలో తగినంత సమయం గడపక పోవడం. మోషే ముఖం ప్రకాశించింది ఎప్పుడు? పర్వతం మీద దేవునితో నలభైరోజులు సహవాసానంతరమేగదా! దేవుణ్ణి ముఖాముఖాగా చూచిన వాడు గనుకనే అతడు పరిశుద్ధ దైవజనుడయ్యాడు. అలానే ఏలీషా "ఎవని సన్నిధిని నేను నిలవబడి వున్నానో ఇశ్రాయేలు దేవుడైన ఆ యెహోవా" అని దేవుణ్ణి గురించి చెప్పాడు. 2 రాజులు 3:14; 5:16

యేసయ్య అనేకసార్లు జనసమూహాన్ని విడిచి పరలోక దేవుని సన్నిధిలో ఏకాంతంగా గడపడానికి వెళ్ళేవారు. మార్కు 1:35 "చాలా పొద్దుపోయే వరకు ఆయన రోగులను స్వస్థపరచి, ఉదయమే లేచి ప్రార్థించడానికి ఏకాంత స్థలానికి వెళ్ళాడు.

దైవసన్నిధిలో ఎక్కువగా కాచుకొని వున్నందువల్లనే ఏలీషా నిర్భయంగా, నిర్మొహమాటంగా పాపాన్ని ఖండించగలిగాడు. ఏ విధమైన జంకూ, గొంకూ లేకుండా ఇశ్రాయేలు రాజుకు దేవుడు అతని గురించి ఏమని భావిస్తున్నాడో చెప్పగలిగాడు.

కనుక మనం దేవుని కృపాసనాన్ని సమీపించేటప్పుడు దేవుడు మన ప్రార్థనలు వింటున్నాడో లేదోనని మనం ఆత్మ పరీక్ష చేసికోవలసి వుంది. పరిశుద్ధులుగా బోధిస్తునందున ఎలాంటి కష్టాలనైనా ఎదుర్కోడానికి మన మనస్సు యింకా సిద్ధంగా లేవేమో! పరిక్షించుకుందాం! అలాంటప్పుడు మన ప్రార్థనల వలన ఫలితం ఏముంటుంది! యాకోబు 5:16లో వున్నట్లు నీతిమంతుని 'ప్రార్థన' మనః పూర్వకమైన విజ్ఞాపన, బహు శక్తివంతమైనది.

దేవుడు తన వాక్యంలో విధించిన స్థాయిని తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు, దేవుడు వాటిని ఏ విధంగా వ్యతిరేకిస్తాడో మనం కూడా వాటిని ఆ విధంగా నిర్మొహమాటంగా వ్యతిరేకించాలి. అప్పుడే మనం నిజమైన ఆధ్యాత్మిక వీరులం కాగలం. అలాంటి కృప పరిశుద్ధాత్మ దేవుడు మనందరికీ దయచేయునుగాక! దేవునికి స్తోత్రం!



బ్రదర్.ప్రసన్న

# విశ్వసించువాడు కలవరపడడు

"ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను. ఆ వాక్యము శరీరధారియై, కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను"
- యోహాను 1:1,14.

**మీ**రు వాక్యమును దేవునిగా నమ్మినట్లయితే ఆ వాక్యము శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను. మీ హృదయాలలో కలవరము లుండవు. యేసుక్రీస్తు అనేక అద్భుతాలు, సూచకక్రియలు, మహాత్కార్యములు చేసినప్పుడు శిష్యులు చూసారు. అయినప్పటికి మీ హృదయములను కలవరపడనియ్యకుడి అని హెచ్చరించుచున్నాడు (యోహాను 14:1). కలవరానికి గల కారణం వారు యేసయ్యను విశ్వసించవలసినంతగా విశ్వసించలేదు గనుక. చాలామందికి దేవుడు ఉన్నాడని తెలుసు. అయితే ఆ దేవుడిని ఎలా నమ్మాలో తెలియదు. విశ్వసించే హృదయంలో పొరపాటున కూడ కలవరం గూడు కట్టుకోదు అని గుర్తించాలి.

**అర్ధ విశ్వాసం**

ఒకసారి ఏమి జరిగిందంటే ఒకామె వాళ్ల అబ్బాయికి ముఖమంతా వాసిపోయి ఉంటే తాయత్తు కట్టించింది. నేను ఆ తాయత్తును చూసి ఇదెందుకు కట్టించారమ్మ, దేవునికి ప్రార్ధన చేస్తాను తగ్గిపోతుంది అని చెప్పాను. దేవుని మీద నమ్మకంతోనే ఇంత దూరం వచ్చామని చెప్పింది. సరే ఆ తాయత్తు తీసేయ్ అని చెప్పాను. ఆమె నా ముఖం వైపు చూసిందే గాని తాయత్తు తీసేదానికి ఇష్టపడలేదు. తరువాత వాళ్ల బాబుకి చెప్పాను ఆ తాయత్తును విప్పమని. వాడు విప్పి చేతిలో పట్టుకొని వుంటే వాళ్ళమ్మ వాడి చేతిలోనిది లాక్కుని సంచిలో వేసుకుంది. మరలా అవతలకి వెళ్ళిన తరువాత కట్టేందుకు. దేవున్ని నమ్మాను అంటుంది. కాని ఆ తాయత్తు మీద నమ్మకం పోలేదు.

అమెరికా, కెనడాకి మధ్య నయాగర జలపాతం ఉంది. నేను ఆ ప్రాంతానికి వెళ్ళినప్పుడెల్లా ఆ జలపాతం చూడడానికి వెళ్తాను. ఆ జలపాతంలో వేల అడుగుల ఎత్తునుండి క్రిందికి నీళ్లు పడుతూ వుంటాయి. అది ప్రపంచంలోనే పెద్ద జలపాతం. ఒక గారడీవాడు ఆ జలపాతం మీదుగా అటు ఇటు ఒక తీగ కట్టాడు. ఇటు అమెరికాలోను, అటు కెనడాలోను అతను పెద్ద ఎత్తున ప్రచారం చేశాడు. నేను తీగ మీద నడుస్తాను పలాన



రోజున, పలాన టైంలో అని. ప్రజలు చూడడానికి వచ్చారు. ఆ సాహసం చేసేటైం అయింది. పెద్ద వెదురు తీసుకుని అడుగులో అడుగు వేస్తూ ఆ తీగమీద అవతలికి చేరాడు. ఆ సాహసం చూసిన ప్రజలు చప్పట్లు కొడుతూ, కేకలు వేశారు. ఇప్పుడు కర్రలేకుండా వెళ్తాను అని చెప్పాడు. అందరూ వద్దు అంటున్నా ఇవతలికి వచ్చాడు. అందరూ ఇతడు సామాన్యుడు కాదు అనుకున్నారు. ఇప్పుడు నేనొక్కడినే కాదు, నా భార్యను కూడా తీసుకొని వెళ్తాను అని చెప్పాడు. అందరూ నీవు క్రింద పడితే ఈదుకుంటూ బయటికి వస్తావు. ఆమెను ఎందుకు తీసుకొని వెళ్తావు అన్నారు. అయినా ఆమెను అతని భుజాల మీద ఎక్కించుకొని తీగమీద నడిచి అవతలికి చేరాడు. ఇప్పుడు అతను అంటున్నాడు నేను తీగ మీద నడవగలనని మీరు నమ్ముతున్నారా? నమ్మడమేమిటి? కళ్ళారా చూసాము కదా అన్నారు. అయితే మీలో ఒకరు రండి తీసుకొని వెళ్తాను అంటే ఒకరి ముఖం ఒకరు చూసుకుంటున్నారే గాని ముందుకు ఎవ్వరు రావడం లేదు. వారంతా నమ్ముతున్నారు విశ్వసిస్తున్నారు గాని వారి హృదయం యొక్క అట్టడుగున అవిశ్వాసం గూడు కట్టుకొని వుంది. ఎప్పుడైతే అవిశ్వాసం గుండెల్లో చోటు చేసుకుంటుందో హృదయంలో తెలియని భయం కలుగుతుంది. ఈ రోజుల్లో చాలామంది ప్రతి చిన్న విషయానికి కలవరం చెందుతూ వుంటారు. పిల్లల్ని పెంచే విషయంలో, వారి పెళ్ళిళ్ళ విషయంలో, ఇళ్ళు కట్టుకొనే విషయంలో, అప్పులు తీర్చుకొనే విషయంలో కలవరం, ఐతే దేవుడ్ని నమ్ముకొని ఎంతకాలం అయిందని అడిగితే 13సం॥లు, 8 సం॥లు అని చెప్తారు. అన్ని సంవత్సరాలు దేవునిలో జీవించినా, దేవునిని వారు సరిగా విశ్వసించలేదు.

కొందరు యేసయ్యను విశ్వసించకుండా నా (ఏసన్న) మీద విశ్వాసముంచుతున్నారు. యేసయ్య మన అందరి నిమిత్తం సిలువలో ప్రాణత్యాగం చేశారు. ఆఖరి రక్తపు బొట్టు వరకు రక్తం కార్చారు. గనుక ఆయన మీద విశ్వాస ముంచాలి. మరి మీ గురి ఎవరి మీద? మీరు నమ్మింది ఎవరిని? దైవసేవకులుగా మేము నిమిత్తమాత్రులమే. యేసయ్య మీకు ప్రార్థన చేయమని మాకు చెప్తాడు. అదే మేము చేస్తున్నాము. మీకు ఏ మేలు అయినా, యేసయ్య ద్వారానే జరగాలే గాని మా ద్వారా కాదు.

ఒకసారి నేను మద్రాసుకి మీటింగ్స్‌కు వెళ్తుంటే ఒక బాబు వచ్చి మా అమ్మగారికి బాగా జ్వరం అన్న మీరు వచ్చి ప్రార్థన చేస్తే బాగుంటుందని ఏడ్చాడు. నాకు టైం లేదని చెప్పి కొబ్బరినూనె ప్రార్థన చేసి ఆ బాబుకి ఇచ్చాను. ఆ బాబు ఇంటికి వెళ్ళి అన్న ప్రార్థన చేసి ఇచ్చిన కొబ్బరినూనె సీసా ఇది అని చెప్పి ఇచ్చాడు. తరువాత కొంత కాలానికి వాళ్ళ ఇంటికి వెళితే ఆ సీసాకి తాడుకట్టి మేకుకు వేలాడదీసి వుంది. వాళ్ళు ఆ సీసాను పడేయకుండా దేవునిగా ఆరాధిస్తున్నారు. ఇలాంటి పనులు చేయుట వలన సాతానుకి చోటిచ్చిన వారవుతారు. భార్యభర్తలు పోట్లాడుకోవాలంటే ఆ సీసా వున్న గదిలో పోట్లాడుకోరట. బయటికి వచ్చి పోట్లాడుకుంటారట. నిద్రపోయేటప్పుడు కాళ్లు సీసా వైపు పెట్టరట. ఇదే సాతాను క్రియ దేవునిని విశ్వసించకుండ, సీసా మీద విశ్వాసం పెంచుకున్నారు. బైబిల్ అంటుంది సాతానుకి చోటియ్యవద్దని.

**"విశ్వసించువాడు కలవరపడడు" - యెషయా 28:16.**

నీకు కలవరం వచ్చిందా? భయపడుతున్నావా? ఎందుకని? విశ్వసించవలసిన దానిని విశ్వసించడం లేదు. అనవసరమైన వాటిని విశ్వసిస్తున్నావు గనుక.

ఒకసారి నేను తెనాలిలో రాత్రి 9గం॥ సమయంలో బస్సు ఎక్కాను. రోడ్డుకి అటు ఇటు నిండుగా పంటకాలువలు పారుతూ వున్నాయి. ఆ బస్సులో వాళ్ళంతా వైమరచి నిద్రపోతున్నారు. నా కళ్ళారా చూశాను. ఆ డ్రైవరు బస్సెక్కేటప్పుడు బాగా త్రాగి ఎక్కాడు. నాతోపాటు బస్సు ఎక్కేవారు చూసారు గాని ఆ డ్రైవర్‌ని నమ్మి అటు, ఇటు కాలువలు వున్నా నిద్రపోతున్నారు. ఒకసారి ఆలోచించండి. త్రాగుబోతుని నమ్మినంతగా దేవునిని నమ్ముటలేదు. విశ్వసించే వాడు విశ్వసించవలసిన రీతిగా విశ్వసిస్తే కలవరముండదు. విశ్వసించు వారు ఎలా వుంటారంటే.

**"యెహోవా యందు నమ్మిక యుంచువారు కదలక నిత్యము నిలుచు సీయోను కొండవలె నుందురు." కీర్తనలు 125:1.**

(తరువాయి 26వ పేజిలో)



## ఆర్.ఎలూజై

# జయం మనదే

నేడు ప్రపంచ వ్యాప్తం అంతటా 'పాల్' పై ప్రశంశల జల్లులు కురుస్తూనే ఉన్నాయి. అసలు జరుగబోయే విషయాలను ముందుగా ఊహించి చెప్పడమే కష్టమైన విషయమైతే, మరి చెప్పింది చెప్పినట్లు నెరవేరడమో, ఖచ్చితంగా అరుదైన విషయమే. ఎక్కడో ఇంగ్లాండ్ దేశంలో జన్మించి, జర్మనీలో పెరుగుతున్న 'పాల్' చెప్పిన విషయాలు నూటికి నూరు శాతం ఖచ్చితంగా జరగడంతో యావత్ ప్రపంచం ఆశ్చర్యానికి లోనయ్యింది. ఇంతకీ ఎవరీ 'పాల్' అని ఆలోచిస్తున్నారా? ఈ మధ్యనే దక్షిణాఫ్రికా దేశంలో నిర్వహించబడిన ప్రపంచ సాకర్ సమరంలో, దిగ్గజాల అంచనాలు తప్పుతున్న సమయంలో, తప్పులకు తావు లేకుండా, విజేతలెవరో ముందుగానే జోస్యం చెప్పిన, ఎనిమిది కాళ్ళ సముద్ర జీవి 'ఆక్టోపస్సే' ఈ పాల్. జర్మనీలోని ఓ అక్వేరియానికి చెందిన ఈ సముద్ర జీవి వయస్సు ఇంచుమించు రెండేళ్ళు. ఇంతకీ ఇది జోస్యం చెప్పే పద్ధతి విచిత్రంగా వుంటుందట. రెండు దేశాల మధ్య ఆట మొదలవడానికి ముందే, రెండు గాజుపెట్టెలకు ఆ దేశాల జాతీయ పతాకాలను తగిలించి, ఆ గాజు పెట్టెల్లో రుచికరమైన ఆహార పదార్థాల నుంచి ఆక్టోపస్ ముందుంచుతారట. ఇక ఆ జీవి మొదటిగా ఏ పెట్టెనయితే ఎంపిక చేసుకుంటుందో, ఆ జట్టే గెలిచే జట్టన్న మాట. ఇలా ఈ జీవి జర్మనీ ఆడిన అన్ని మ్యాచ్ ఫలితాలను ఇంకా తుది ఆట (చివరి ఆట) ఫలితాన్ని ముందుగానే ఖచ్చితంగా ఊహించిందట. చేతి గీతలు చూసి కోసే కోతలు, వుట్టి కూతలుగానే మిగిలిపోతున్న ఈ రోజుల్లో, ఒక సముద్ర జీవి చెప్పిన జోస్యం ఖచ్చితంగా నెరవేరడమంటే సాధారణమైన విషయమేమి కాదు. అయితే ఈ 'పాల్' ను చూసి మరికొన్ని పక్షులు, జంతువులు (సింగపూర్ చిలుక, అమస్టర్ డామ్‌లో చింపాంజీ) కూడా ఇదే విధంగా జోస్యం చెప్పాయి. కానీ అవేమి ఖచ్చితంగా నెరవేర్చకపోవడం మరో విశేషం.

ఇంతకీ ఈ జోస్యాల గురించి అడిగితే, గెలిచినోడు గొప్పగా వుందన్నాడు. ఓడినోడు వట్టిదన్నాడు. ఎవరేమనుకున్నా, ఈ మూడు గుండెలుండే సముద్రజీవి 'ఆక్టోపస్' మాత్రం ఒక్కసారిగా 'సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్' అయిపోయింది. మరి ఇదే విషయాన్ని సంఖ్యా శాస్త్ర నిపుణులతో చర్చిస్తే ఇలా చెప్పిన జోస్యాలు నెరవేరడమేమి వింతైన విషయం కాదనీ రెండు రాశుల్లో (Units) ఒక దానిని ఎంచుకోవడం, అది ఖచ్చితంగా నెరవేరడం సాధారణ విషయమేనని గణిత శాస్త్రంలోని సంభావ్యతా (Probability) సూత్రాలు ఈ అంచనాలను విపులంగా వివరిస్తాయని తెలియజేస్తారు.

ఇంతకీ అర్థమయ్యేదేమిటంటే, ముందు ముందేం జరగుబోతోందో ముందుగానే తెలుసుకోవాలనే తపన, మనుష్యునికి పుట్టుకతోనే పుడుతోందో ఏమోగానీ, అందుకొరకు సాధ్యమైన అన్ని విధానాలను వాడుకలోనికి తేవడం మాత్రం సాధారణమైన విషయమైపోయింది. చేతులు గీతల్లోని రాతలు, పక్షులకు



ప్రశ్నలు, శకునాపశకునాలు ఇత్యాధి విధానాలన్ని వాడుకలోనే వున్నా, ఈ ఇంటర్నెట్ యుగంలో మరింత ముందుకెళ్ళి జంతువుల జోస్యాలు కొత్తగా తలకెక్కాయి. మరి ఈ విషయాలను గూర్చి దైవ గ్రంథమేం తెలుపుతుందో గమనిస్తే, మరిన్ని ఆసక్తికరమైన వివరాలు కనిపిస్తాయి.

**రాజైన సౌలు**

శకునములు చూడకూడదని (లేవి 19:26) ధర్మశాస్త్రంలో చెప్పబడిన కారణము చేత ఇశ్రాయేలీయుల మొదటి రాజైన సౌలు కర్ణ పిశాచము గలవారిని, చిల్లంగి వారిని ( 1 సమూ 28:3) దేశము నుండి వెళ్ళగొట్టి దైవాజ్ఞను శిరసావహిస్తాడు. అయితే ఫిలిష్తీయులు దండెత్తి వచ్చినప్పుడు, కర్ణ పిశాచము ద్వారా, శకునము చెప్పి మాటలాడు స్త్రీ యొద్ద, జరగబోవు యుద్ధ ఫలితము విచారణ చేయ వెళతాడు. కానీ ఆ యుద్ధంలో అపజయమే కలుగుతుందన్న సమాధానంతో బహు భయము మొందినవాడై, కలత చెందడం, ఘోరాతి ఘోరంగా ఓడిపోయి మృతినొందడం అతని జీవితపు ముగింపు దశలోని దీనాతి దీనమైన సంభవాలు.

**రాజైన మనష్షే**

ఇంకా, ఈ శకునాల సాంగత్యంతో శాపాన్ని, శ్రమలనూకొని తెచ్చుకొనిన వారిలో చెప్పుకొనదగిన వాడు యూదా రాజైన మనష్షే, తన తండ్రియైన హిజ్కియా చూపిన దైవ భక్తి ప్రవత్తులకు భిన్నంగా ప్రవర్తిస్తూ, దేవుని దృష్టికి చెడు నడత నడవడమే గాక (2 దిన 33:13) ముహూర్తములు విచారించుచు, చిల్లంగితనమును వాడుకచేసి, కర్ణ పిశాచములతోను సోదెగాండ్రతోనూ సాంగత్యం చేసి, దేవునికి బహుగా కోపము పుట్టించిన వాడయ్యాడు. అటు పిమ్మట జరిగిన యుద్ధంలో, అష్షూరు రాజు సైన్యాధిపతులు, అతనిని గొలుసులతో బంధించి బబులోనుకు తీసుకుని పోవడం, శ్రమలోనున్నప్పుడు అతడు దేవుని సన్నిధిలో తననుతాను తగ్గించుకోవడం, దేవుడతనిని రాజ్యములోనికి తిరిగి తీసుకుని రావడం ఇవన్నీ మార్పు చెందిన మనిషి జీవితంలోని మధుర ఘట్టాలు.

**ప్రవక్తయైన బిలాము**

అయితే వీరందరికన్నా ముందే, ఇశ్రాయేలీయులు మోయాబు దేశం గుండా ప్రయాణం చేస్తున్నప్పుడు, వారిని శపించ ప్రేరేపించబడిన ప్రవక్తయైన బిలాము చూసిన శకునములు, మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

దేవుని నెరుగని ప్రజల మధ్యన నివసిస్తున్నప్పటికీ, దేవుని గూర్చిన జ్ఞానానుభవము గలవాడైన బిలాము, దేవుడు వద్దని వారించినా, మోయాబు రాజు వత్తిడికి తలవంచడం, ఇశ్రాయేలీయులను శపించడానికై పలుమార్లు ప్రభుని అనుమతి కోరడం, అయితే ప్రతిసారీ అది ఆశీర్వాదమై దేవుని ప్రజలు దీవించబడడం మొదలైన విషయాలు సంఖ్యాకాండంలో గమనించ గలం. దైవాజ్ఞకు వ్యతిరేకంగా వెళ్ళిన ప్రవక్త, శకునములు చూచువానివలె మిగిలిపోవడం, చివరకు ఎవరినైతే శపించదలచాడో వారి చేతిలోనే హతమవ్వడం (యెహో 13:22) మనసును కదిలించే కన్నీటి దృశ్యాలు.

ఇలా చెప్పుకుంటూ పోతే, శకునములను వాడుక చేసి అధోగతి పాలైన ఆహాబు, శకునగాండ్ర సలహాలతో కష్టాలను కొని తెచ్చుకున్న ఐగుప్తు ఫరోలు, అసంఖ్యాకంగా కనిపిస్తూనే వుంటారు. చేయవలసినవి చేయమరచి, శకునాలతో సావాసం చేసిన వారెవ్వరూ గెలిచిన దాఖలాలెక్కడా లేవనేది జగమెరిగిన సత్యం.

**ముగింపు**

ఇంతకీ అర్థమయ్యేదేంటంటే జరగబోయే సంభవాలను ముందుగా ఊహించ యత్నించడం, మానవాళికి కొత్తేం కాకపోయినా, సాధారణ ఊహించడాలన్నీ తప్పేం కాకపోయినా, ఊహించ యత్నించడాలన్నీ శకునములు చూడడం (కర్ణపిశాచము గల వారితో సాంగత్యం చేయడం) లాంటివి కాకపోయినా, అసలు ఖచ్చితంగా జరుగునని తెలిసిన విషయాలను ప్రక్కనబెట్టి, జరుగుతుందో లేదో, జరగవచ్చునేమోనన్న విషయాలకై వెంపర్లాడడం మాత్రం, శోచనీయమైన అనుభవమేనని చెప్ప తప్పదు. లోకానికి ఒక ముగుంపు ఉందనీ, లోకంలో యాత్ర చేసే వారికి ఒక పరిమిత అవధి వుందనీ, ఆ పరిధిలో, ఆ అవధిలో, సవ్యంగా సాగితేనే, సత్యమైన నిత్యత్వపు గమ్యాన్ని గతి తప్పకుండా చేరగలమనీ గమనించగలిగితే, గురి గాడిన పడుతుంది. ఆ రీతిన గురియొద్దకే పరుగిడినట్లయితే, జయం మనదేనని తెలిసిన విశ్వాసీ-నీవే ప్రభుని సహవాసి నిజం, నీవే ప్రభుని సహవాసి.

కొసమెరుపు: ఇన్ని జోస్యాలు చెప్పిన ఆక్టోపస్ పాల్ 26 అక్టోబర్ 2010న జెర్మనీలో అంతకాలం అది నివసించిన అక్వేరియంలోనే తుది శ్వాస విడిచింది. దానికి అక్కడే ఒక స్మారకాన్ని నిర్మించారు. అది మట్టిలో కలిసిపోవడంతోనే దాని జోస్యాలు కాలంలో కలసిపోయాయి. జనులు కూడా దాన్ని మరచిపోయారు.



ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి

# పవిత్ర భూమికి పరిశుద్ధ యాత్ర

## (2)

రెండోరోజు యాత్రలో మొదటి ప్రదేశం ప్రపంచపు ఏడు వింతల్లో ఒకటైన పిరమిడ్ సందర్శన. ఈజిప్ట్‌కు రాజధాని కైరో నగరం. కైరోలో ఎటు తిరిగినా పిరమిడ్ కన్పిస్తుంది. పిరమిడ్‌లకి చాలా చరిత్ర వుంది. నిజానికి పిరమిడ్‌లు ఫరో వంశీయుల సమాధులు. ఫరో అనేది అధికారిక నామం. అసలు పేరు వేరే వుంటుంది. ఐగుప్తుకు రాజు అయినవాడిని ఫరో చక్రవర్తిగా పిలుస్తారు. పిరమిడ్‌లు క్రీస్తుకు పూర్వం 3500 సంవత్సరాల కాలం నుంచే ఉన్నాయి. మొదటి పిరమిడ్ జోసర్‌ది అయితే చివరిది అహమోస్‌ది. మొత్తం 18 తరాల పిరమిడ్‌లు కైరోలో ఉన్నాయి. క్రీ.పూ 2611 కాలం నాటి పిరమిడ్‌ని నిర్మించినవాడు ఇమ్‌హటెప్. అన్నింటికన్నా పెద్ద పిరమిడ్ ఖుఫూ అనే రాజు సమాధి. ఇతను 4వ తరానికి చెందినవాడు. ఈ ఇది 37 ఎకరాల విస్తీర్ణంలో కట్టారు. దీని ఎత్తు 60మీటర్లు, 121 మీటర్ల వెడల్పు, 109మీటర్ల లోతు ఉంది. భూగృహ మార్గంలో 3.5 మైళ్ళ వరకూ సొరంగాలు ఉన్నాయి. ఈ పిరమిడ్ లోపల రాజు ఈ లోకంలో వాడే సమస్త వస్తువులు అక్కడ వుంటాయి. రాజు మరణించినా అతని ఆత్మ ఈ వస్తువైభోగంతో ఉండాలని అలా నిక్షిప్తం చేసేవారు. పైగా కొంతమంది బానిసలనూ చంపి అతనికి తోడుగా పాతిపెట్టేవారనే ఉదంతం కూడా వుంది.

పిరమిడ్ దీర్ఘ చతురస్రాకారంలో అడుగుభాగం వెడల్పుగాను పైకి వెళ్ళిన కొద్దీ సన్నగా కొనదేలి ఉంటుంది. ఈ రకమైన నిర్మాణానికి కారణం ఏమిటనే ప్రశ్నకు ఈజిప్షియన్లు ఒక సమాధానం చెప్తారు. భూమిపై నలుచదరంగా ఉండి పైభాగం మొన తేలినందువల్ల సూర్యరశ్మిలోని అధిక శక్తిని స్వీకరించి నలుదిక్కులా ప్రసరిస్తుందని దీనివల్ల పిరమిడ్ లోపల ఉన్న రాజు ప్రతిరాత్రి పునర్జీవితుడై తన రాణులను భూగృహ మార్గం ద్వారా వెళ్ళి కలుస్తాడనే గాథ వాళ్ళు పరంపరీణంగా చెప్పుకుంటారు. పిరమిడ్ నిర్మాణానికి 23 నుంచి 30 సంవత్సరాలు పట్టింది. 30 వేల నుంచి లక్షమంది బానిసలు పనిచేశారు. వీళ్ళంతా ఇశ్రాయేలీయులే. చెరపట్టి బానిసలుగా తెచ్చినవారే. కింది భాగంలోని రాయి 8 టన్నుల బరువు, పై భాగంలోని రాయి 1 టన్ను బరువు ఉంటుంది. అంతర్భాగంలో ఉన్న విలువైన పాలరాయి దాదాపు 500 మైళ్ళ దూరంలో ఉన్న కొండల నుంచి ఒంటెల బండ్ల మీద తెప్పించారు. అన్నీ తెల్ల సున్నపురాళ్ళే. ఖరీదైన అంతర్భాగపు రాళ్ళను ముస్లీములు, అరబ్బులు తీసుకు వెళ్ళారు. కైరోలో మహమ్మదీయులు కట్టిన పెద్ద మసీదులకు ఈ రాళ్ళు ఉపయోగించారనే కథనం కూడా వుంది.

పిరమిడ్‌లు, పిరమిడ్ ఆకారంలో ఉన్న నిర్మాణాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. అల్జీరియా, మెసపోటోమియా, సూడాన్, నైజీరియా, గ్రీస్, స్పెయిన్, చైనా, మెసోమిరికా, ఉత్తర అమెరికా, రోము, ఇండియా (తంజావూరులోని బృహదేశ్వరాలయం, 11వ శతాబ్ధి చోళులు నిర్మించారు), ఇండోనేషియా, జర్మనీ తదితర దేశాల్లో పిరమిడ్‌లు, పిరమిడ్ ఆకారంలో ఉన్న నిర్మాణాలు కన్పిస్తాయి. ఐతే అన్నీ సమాధులు మాత్రం కాదు. కైరోలో ఉన్న పిరమిడ్ ప్రాంతంలో అరబ్బులు అధికంగా వ్యాపారం చేస్తారు. వీళ్ళకి కాస్తంత నోటి దురుసుతనం ఎక్కువ. అడిగి-



కొనకపోతే బెదిరించి డబ్బు వసూలు చేస్తారు. అందువల్ల కొనదలుచుకుంటేనే అడగాలి. కొంచెం ఖరీదు కూడా ఎక్కువే. ఇక్కడ కాసేపు ఒంటెపై ఎక్కి తిరగవచ్చు. ఒంటెపై ఎక్కి తిరగటం ఉచితం. కాని దిగేటప్పుడే డబ్బులివ్వాలి. లేకుంటే నిలువు దోపిడీ చేస్తారు. ఇక్కడ మరోవిషయం గమనించాలి. మన దగ్గర డబ్బు డాలర్లలో చెల్లుబాటవుతుంది. ఎక్కువ డబ్బులు కనిపించేలా డబ్బు తీయవద్దని ముందే హెచ్చరిస్తారు. తక్కువ డబ్బులే బయట పెట్టి వాడాలి.

సుమారుగా 650 పిరమిడ్‌లు వరకూ నిర్మించారు. ప్రస్తుతం 168 వరకూ ఉన్నాయి. అధికభాగం శిధిలమయినా, ముస్లిములు, అరబ్బులు ఆ సమాధుల సంపదను దోచుకొని నాశనం చేసినా మిగిలి ఉన్నవి మాత్రం మన చేతివేళ్ళ మీద లెక్కించవచ్చు. ఒకవైపు చూస్తే మూడు పిరమిడ్లు వరుసగా కన్పిస్తాయి. వీటిని "పిరమిడ్ పనోరమా" అంటారు.

ఆ తర్వాత ఆ దారినే వెళ్తూ ఉంటే Great sphnyx of Giza కన్పిస్తుంది. నైలునదికి పడమరగా ఉన్న అతిపెద్ద ఏకశిలా విగ్రహం ఇది. ప్రపంచంలో ఉన్న అతి పెద్ద విగ్రహాల్లో ఇది ఒకటి. 241 అడుగుల పొడవు 206 అడుగుల వెడల్పు, 66.34 అడుగుల ఎత్తు ఉంది. ఈజిప్టు రాజు ఫారుజ్ ఖాఫ్రా క్రీ.పూ 2558-2532 కాలంలో దీన్ని నిర్మించాడు.ఇదో విచిత్రమైన ఆకారం ఈజిప్టుపురం గాథల ప్రకారం సింహం పోలిన శరీరం, స్త్రీని పోలిన ముఖం (మనిషి తల) గద్దరెక్కలున్న అతి పెద్ద శిలావిగ్రహం ఇది. దీనికి దూరంగా ఖుఫూ పిరమిడ్ అదే వరుసలో కన్పిస్తుంది. మనిషికున్న జ్ఞానం, సింహానికున్న వేగం, పక్షికి ఉన్న స్వతంత్రత, అందమైన స్త్రీ ముఖసౌదర్యం సంతోషానికి చిహ్నాలుగా ఈ స్ఫినిక్స్‌ని రాతిమీద చెక్కి నిర్మించారు. ఐతే దీని ముక్కు ముస్లిములు ధ్వంసం చేశారు.

ఈజిప్టు వాసులు అధిక శాతం ధూమపాన ప్రియులు. మద్యం వారికి ప్రియమైనది. స్త్రీ లోలత్వం మరింత ఎక్కువ. వాళ్ళకు స్నానం చేసే అలవాటుందో లేదో గాని మాతో వచ్చిన గైడ్ నాలుగు రోజుల వరకూ స్నానం చేసిన దాఖలాలు లేవు. పైగా రోజూ విపరీతంగా సుగంధద్రవ్యాలు (సెంట్) పూసుకుంటాడు. సిగరెట్‌వాసన, ఈ సెంటు వాసన కలిసి వాడి దగ్గర కెళ్ళాలంటే భయమేసేది. ప్రపంచానికి సుగంధగంధం తయారు చేయడం నేర్పింది ఈజిప్షియన్లే. అందుకే ఎటు తిరిగి ఈ ఫ్యాక్టరీలే కన్పిస్తాయి. అదీ ఖరీదు ఎక్కువే.

అనంతరం మధ్యాహ్న సమయంలో తాజ్‌మహల్ హోటల్‌లో భోజనం. ఇక్కడ పప్పుచారు, అప్పడాలు దొరుకుతాయి. కాస్త ఆంధ్రాభోజనం, ఊరగాయపచ్చళ్ళు ఉంటాయి. ఐతే మటన్, చికెన్, ఫిష్ మామూలే. రొట్టెలు కేకులు సరేసరి. భోజన సమయంలో ఈజిప్షియన్ నృత్యాలు, చిన్న చిన్న తమాషాలు చేస్తారు. అందులో గిరగిర తిరిగే వస్త్ర విన్యాసం ఒకటి. గుండ్రంగా కుట్టిన వస్త్రం మధ్యలో కన్నం చేసి నడుముకు కట్టుకుంటాడు. గిరగిర తిరుగుతుంటే ఒకసారి చక్రంలా, మరోసారి గొడుగులా ఉంటుంది. ఒక సందర్భంలో రంగురంగుల బల్బులు అంతా వెలుగుతాయి. మరోసారి పైనుంచి కిందికి ఒక కుండ లేదా డబ్బా ఆకారంలో పూర్తిగా నిండిపోతుంది. ఇలా విచిత్ర విన్యాసాలు ఒకే గుడ్డతో చేస్తాడు.

తర్వాత Holy Crypt దర్శనం. అతి ప్రాచీన చారిత్రక ప్రదేశాల్లో ఇది ఒకటి. బాలయేసును యోసేపు మరియమ్మలు ఐగుప్తుకు తీసుకువచ్చారు. యేసు పుట్టినప్పుడు జ్ఞానులు దర్శించి బంగారము, బోళము, సాంబ్రాణి బహుమతులుగా యిచ్చారు. అనంతరం ప్రభువు దూత యోసేపుకు స్వప్నంలో కన్పించి ఐగుప్తుకు వెళ్ళమని ఆదేశించినట్టు మత్తయి 2:13-23లో తెలుస్తుంది. ఐగుప్తులో యేసు 3 సంవత్సరాల 11 రోజులున్నాడు. యేసు ఐగుప్తులో నివసించినదీ, వదలినదీ కూడా పాతనిబంధనలో రేఖామాత్రంగా ఉంది. హోషెయ 11:1; యెషయ 7:14; 9:1; యిర్మియా 31:15-17; నిర్గమ 4:22,23లలో వివరాలు కన్పిస్తాయి. ఈజిప్ట్‌లోని కోప్టిక్ మిషన్‌వారు యేసు ఐగుప్తులో బాల్యం గడపడం వారికి భాగ్యంగా చెప్పుకుంటారు. పైగా ఈజిప్టు వాసుల్లో పాపం పెరిగినా కృపగల దేవుడు సహించి క్షమిస్తూ వారి మారుమనస్సు కోసం ఎదురుచూస్తున్నాడన్నది వారి విశ్వాసం.

ప్రపంచంలో తెలివిగల జాతుల్లో ఒకటయిన ఈజిప్టు వాసులకు మార్పు కలిగి నిజమైన దేవుని నమ్మి ఆరాధించాలని, వారిపై ప్రేమ కురవాలని మనం కూడా ప్రార్థన చేద్దాం. యేసు తన బాల్యంలో తలిదండ్రులతో రహస్యంగా గడిపినప్పుడు దేవదూతల సంరక్షణలో ఉన్నాడన్నది కాప్టిక్ మిషన్ వాసుల విశ్వాసం. ఐతే యోసేపుకు కుటుంబ సంరక్షణకు ఎలా గడిపాడన్నదే ప్రశ్న. ప్రపంచంలో ఎక్కడా లేనంత ఖరీదు గల బంగారము, బోళము, సాంబ్రాణికి ఈజిప్టులో మరింత గిరాకి ఉంది. జ్ఞానులు యిచ్చిన బంగారము, బోళము, సాంబ్రాణిని విక్రయించి యోసేపు కుటుంబాన్ని పోషించాడనే కథ కూడా ప్రచారంలో ఉంది. ఆధారం లేకపోయినా నమ్మశక్యంగా ఉంది. ఇది ఆలోచన చేయవలసిన విషయం కూడా.

పవిత్రకుటుంబానికి సంబంధించిన తైలవర్ణ ఛాయాచిత్రం 1525లో వచ్చింది. దీన్ని Jesus Mary Joseph అని అదే

JMJ సంస్థగా సంస్థగా నామకరణం జరిగిందని అంటారు. మత్తయాస్ ఉల్ఫ్ లక్స్ంబర్గ్ వాసి ఈ సంస్థకు ఆద్యుడు. డిసెంబర్ 30వ తేదీ Holy Family Festival చేస్తారు. దీన్ని 13వ పోపు అయిన పోప్ లియో ఏర్పాటు చేసి ఈ పండుగను నిర్ధారించి ప్రారంభించాడు. Holy Family నివశించిన ఇల్లు ఇప్పటికీ ఉంది. అది నేడు భూగృహంగా (Cellor) కన్పిస్తుంది. దీనిపై ఒక దేవాలయం కూడా నిర్మించారు. ప్రతి నిత్యం ఆరాధనలు జరుగుతాయి.

పవిత్రకుటుంబం చూసి ప్రార్ధనలు చేసిన అనంతరం సుదీర్ఘమైన ప్రయాణం. ఇశ్రాయేలీయులు దాస్యం నుంచి విముక్తులయి పాలుతేనెలు ప్రవహించే కానాను (నేటి ఇజ్రాయేల్) దేశానికి 40 సంIIరాలు ప్రయాణం చేశారన్నది బైబిలు తెలియజేస్తుంది. మాకు మాత్రం సుఖమైన మార్గంలో, విలాసవంతమైన ఎ.సి బస్‌లో ఎనిమిది గంటలు పట్టింది. మార్గ మధ్యలో సూయజ్ కెనాల్ దాటి ఆఫ్రికా సరిహద్దు నుంచి ఆసియా భూభాగంలో అడుగుపెడతాం. సూయజ్ కాలువ మధ్యదరా సముద్రాన్ని, ఎర్ర సముద్రాన్ని చీల్చి మధ్యలో కట్టి మానవ మహా నిర్మాణం యిది. 1869లో ప్రారంభమయింది. దాదాపు పదేళ్ళు నిర్మాణ అనంతరం ఆసియా, ఆఫ్రికా దేశాల్లో చాలా ప్రాంతాలకు మంచి నీటి సరఫరా జరుగుతుంది. పైగా సరుకు రవాణాకు ఈజిప్ట్‌కు ఇతర దేశాలకు సముద్రయానం ద్వారా ప్రయాణకాలం పూర్వం 33 రోజులు పట్టేది. సూయజ్ కాలువ నిర్మాణం వల్ల మూడు రోజుల్లో నౌకాయానం ద్వారా సరుకు రవాణా అవుతుంది. ఈ సూయజ్ కెనాల్ టన్నెల్ పొడవు 1:61 కి.మీ ఉంటుంది. నిత్యం మిలటరీ పహారా ఉంది. మార్గంలో ఎక్కడా ఆగకూడదు. ఒకవేళ ఆగినా బస్ దిగకూడదనే కఠిన నియమం ఉంది.

ఈ ప్రయాణంలో ఎర్రసముద్రం సమీపంగా మంచి రహదారి మార్గం ఉంది. దాదాపు 100 గజాల దూరం నుంచే ఎర్ర సముద్రాన్ని చూస్తూ ప్రయాణించవచ్చు. ఎర్రసముద్రంలో Oil Drilling కొనసాగుతుంది. అందువల్ల సముద్రంలో మహా పెద్ద నిర్మాణాలు, ఆయిల్ డ్రిల్లింగ్ మిషన్లూ కన్పిస్తాయి. అసలు ఎర్రసముద్రం అనే పేరు ఎందుకు వచ్చింది. నీరు కూడా ఎరుపురంగులో ఉన్నట్టనిపిస్తుంది. దానికి కారణం ఉంది. ఎర్రసముద్రానికి ఆవలితీరంలో ఎర్రని కొండలున్నాయి. ఆ రంగు పరావర్తనం చెంది నీరు ఎర్రగా ఉన్న భ్రమ కలుగుతుంది.

ఆ మార్గమంతా ఇసుక ఎడారి ఒకవైపు. ఎర్రసముద్రం మరోవైపు. పచ్చని చెట్టు ఒకటి కన్పించదు. మార్గమధ్యలో మారా బావి ఉంది. ఇది చారిత్రక ప్రదేశం. మోషే ఇశ్రాయేలీయులతో కలిసి చేసిన ప్రయాణంలో మార్గమధ్యలో దాహం వేసింది. షూరు ఎడారి ప్రాంతంలో వారి నడక. మంచినీరు లభింలేదు. కాని ఎర్రసముద్రానికి సమీపంలో ఒక బావి ఉంది. కాని అందులో నీరు చేదుగా ఉంది. మోషే దేవుని ప్రార్ధించినందువల్ల ఆయన చూపిన చెట్టు ఆకులు ఈ బావిలో వేసిన అనంతరం నీరు మధురంగా మారింది. నిర్గమ 15:23-27, సంఖ్యా 33:8. ఈ బావి నేటికీ ఉంది. ఆ సమీపంలోనే ఎలీము ఉంది. అక్కడ ఖర్జూరపు చెట్లు ఉన్నాయి. బైబిల్లో ఈతచెట్లని అనువాదం. నిర్గమ 15:27; సంఖ్యా 33:9

ఇక్కడే మరో విషయం ప్రస్తావించాలి. ఐగుప్తు నుంచి మోషే ఇశ్రాయేలీయులను తీసుకోని ఎర్రసముద్రం దాటి వచ్చాడు. ఎర్రసముద్రం దాటే సమయంలో సముద్రంపై మంచి రహదారి ఏర్పడింది. ఇరువైపులా నీరు. ఇశ్రాయేలీయులు ముందుకు సాగుతుంటే ఫరోసైన్యం గుర్రాల మీద, రథాలమీద వెంబండించారు. ఐతే ఫరో సైన్యం, గుర్రాలు, రథాలు నీటమునిగి మరణించినట్టు చరిత్ర సాక్ష్యం ఉంది. నిర్గమ 13:17-22, 14:26,27. ఇశ్రాయేలీయులు సముద్రమీద ఆరిన నేలపై నడిచారన్నది ఊహకు అందని సత్యం. ఈ చారిత్రక ఘట్టాన్ని ఆధారం చేసుకుని American Archaiological Society వారు 1980 ప్రాంతంలో ఎర్రసముద్రాంతర్భాగంలో పరిశోధన చేశారు. 58వేల అడుగుల లోతుకు వెళ్ళి వెతికారు. అక్కడ వారికి కొన్ని లక్షల గుర్రపు ఎముకలు, రాతి రథచక్రాలు వెలికి తీశారు. ఐదువేల సంవత్సరాల నాటి చరిత్రను ఆధారాలతో నిజమని ఋజువు చేశారు. ఈ ఎముకలు, పరీక్ష చేసిన అంతర్జాతీయ Forinsic Department 5000 సంIIరాల కాలం నాటివనే నిర్ధారించారు. అలాగే రాతిరథ చక్రాలను కూడా పరీక్ష చేసిన Geologists 5000ల సంవత్సరాలకు పూర్వం ఉన్నవనే నిర్ధారించారు. దీనివల్ల బైబిల్లో లిఖించిన ప్రతి అక్షరం నిజమని నిర్ధారణగా తెలుస్తుంది.

మా ప్రయాణం రాత్రికి 10 గం.లకు సీనాయి పర్వతం దగ్గర ఉన్న మోర్గాన్ లేండ్ అనే రిసార్ట్‌లో బస. రాత్రివేళ చలి అధికంగా ఉంది. అయినా ఆ సమయంలో వేడి వేడి భోజనం. మంచి మటన్, చికెన్, ఫిష్, కేకులు, వేడి కాఫీ, మరో నలభై రకాల ఆహార పదార్ధాలు. సీనాయి పర్వతసానువుల్లో ఆ రాత్రి విలాసవంతమైన బసతో రెండో రోజు ప్రయణం సుఖవంతమయింది.

(మిగతా వచ్చేసంచికలో)



# కొత్త కాపురం

**పి.సురేష్‌బాబు**

ఆనంద్‌కు కొత్తగా వివాహమయ్యింది. తన భార్యను తీసుకొని కొత్తకాపురానికి వచ్చాడు. ఉద్యోగరీత్యా వీరిద్దరూ తల్లిదండ్రులకు దూరంగా ఉండవలసి వచ్చింది. పట్టణంలో మంచి ఇల్లు ఒకటి అద్దెకు తీసుకొని వచ్చారు. ఇంట్లో సామాన్లు సదరటం అవన్నీ రెండు మూడే రోజులే పట్టింది.

ఆ తరువాత ఒకరోజు ఇద్దరూ భోజనం చేస్తున్నారు. భోజనం చేస్తూ ఎదురుగా ఉన్న కిటీకిలోనుండి బయటకు చూస్తూ ఉంది ఆనంద్ భార్య. ఒక రెండు నిమిషాలు చూస్తూనే ఉంది. అక్కడ కిటికి బయట ఒక లాండ్రీ షాపు అమ్మాయి బట్టలు ఉతికి ఆరవేస్తుంది. వాటిని ఆరవేస్తుండగా వాటినే తదేకంగా చూస్తూ ఆనంద్ భార్య ఆనంద్‌తో "అటూ చూడండి! ఆ లాండ్రీ అమ్మయి బట్టలు సరిగా ఉతకనే లేదు." అంటూ ఆనంద్ వైపు చూస్తూ "అసలు వాటికి ఉన్న మురికి పోయినట్టే లేదు. మరకలు కూడా కనబడుతున్నాయి. మంచి సబ్బు వాడడంలేదు అనుకుంటా!" కొంచెం నిస్పృహనంగా అంది. ఆ మాటలకు అటువైపు చూసిన ఆనంద్ ఏమి మాట్లాడకుండా కొంచెం తల ఊపి ఊపినట్లుగానే, అవును అనిగాని కాదుఅనిగాని అర్ధమిచ్చేటట్లు కాకుండా కొంత ఆలోచనగా చూసాడు.

ఇలా ప్రతిసారి ఆ లాండ్రీ వారు బట్టలు ఆరవేసినప్పుడల్లా అది ఆమెకు చిరాకుగా అనిపించి ఆనంద్ భార్య ఏదో ఒక మాట అంటూనే ఉంది.

అలా ఒక వారం గడచిన తరువాత మరోరోజు ఆ కిటికీలోనుండి బయటకు చూసి ఆనంద్ భార్య ఆశ్యర్యంగా తన భర్తతో "అబ్బో! చూసారా! ఆ లాండ్రీ వాళ్ళు సబ్బు మార్చి మంచి సబ్బు వాడుతున్నట్టున్నారు. చాలా బాగా ఉతికారు. ఒక్క మచ్చకూడా లేదు. మురికి కూడా ఏమి కనబడడం లేదు." అంది.

వెంటనే ఆనంద్ తన భార్య వైపు చూసి ఒక అర్ధవంతమైన చిరునవ్వు నవ్వుతూ "ఆ లాండ్రీ వాళ్ళు ఎప్పుడూ అలానే ఉతుకుతారు. ఇవాళేమి సబ్బు మార్చలేదు" అన్నాడు. ఆనంద్ భార్య తన భర్త చెప్పే విషయం అర్ధంగాక నొసట కొంత ముడతపడేంత ఆశ్యర్యంతో ఆతని వంక చూసింది. అలా చూస్తున్న తన భార్యతో ఆనంద్ "అవును నేను చెప్పేది నిజమే. ఈ రోజు ఉదయం పెందలకడ నేను లేచి మన కిటికీ అద్దాలకు ఉన్న దుమ్ము మరకలను శుభ్రం చేసాను." "ఇన్ని రోజులు మన కిటికీ అద్దాలకు ఉన్న దుమ్ము మురికి కారణంగా వారి చేసిన పని నీకు అశుభ్రంగాను, అసహ్యంగాను అనిపంచింది. కాని నిజానికి మనం చూసే మనం ఇంటి కిటికీనే అశుభ్రంగా ఉంది." అని కొత్తగా కాపురానికి వచ్చిన తన భార్యకు అర్ధమయ్యేలా వివరించాడు ఆనంద్. వెంటనే ఆనంద్ భార్య "అయ్యో ఇన్ని రోజులు అనవసరంగా వారిని నేను అనవసరంగా అపార్ధం చేసుకున్నాను." అని తప్పు సరిదిద్దుకున్న తత్వాన్ని ప్రదర్శించింది.

ప్రియమైన దేవుని బిడ్డలారా యేసయ్య ఒకసారి ఇలా అన్నాడు "మొదట నీ కంటిలో ఉన్న దూలాన్ని తీసి వేసుకొని తరువాత ఇతరుల కంటిలో ఉన్న నలుసును తీసివేయమని". మనం మనలను శుభ్రం చేసుకోవడం చాలా ప్రాముఖ్యం. ఈ రోజున పదే పదే ఎదుటివారి తప్పులను గురించి మాట్లాడుకుంటాం. మన తప్పులు గురించి మనం ఎంత సేపు మాట్లాడతాం. అస్సలు మాట్లాడటానికి ఇష్టపడం. ఎవరిని మన తప్పుల గూర్చి మాట్లాడనివ్వం. ఎవరైనా మాట్లాడితే వారినే మరల తప్పుపడతాం. నీ తప్పులను సరిచేసుకొనె స్వస్థత బుద్ధి మనకు కావాలి. దేవునికి స్తోత్రం!

## ప్రముఖ సువార్త గాయకుని అద్భుత సాక్ష్యం



**- విజయ్ బెనెడిక్ట్**

**జీవితంలో అతి విలువైన అనుభవం**

# క్రీస్తులో జీవితము

**సర్వలోకమును సంపాదించుకొని తన ప్రాణం పోగొట్టుకొంటే ఏమి ప్రయోజనము?**
*– (మార్కు 8:36)*

నేను నా జీవితాన్ని బాలీవుడ్ సంగీత గాయకునిగా 35 సినిమాల్లో పనిచేసాను. దేవుడు నాకిచ్చిన గొప్ప తలాంతులలో ఒకటి పాడడం. గతంలో సినిమా ప్రజలకై పనిచేసాను. శ్రావ్యంగా పాడి ఎందరినో ఉద్రూత లూగించి, ఎందరో జీవితాల్లో ప్రముఖ వ్యక్తిగా నిలిచాను. కాని నేడు కేవలము క్రీస్తును రక్షకునిగా స్వీకరించిన తర్వాత క్రీస్తు కొరకే పాడాలని నిర్ణయించుకున్నాను. నా తలాంతులలో నా శక్తివంచన లేకుండా అతి శ్రేష్టమైన గీతాల్ని వ్రాయుట పాడుటలో గొప్ప ఆనందాన్ని తృప్తిని పొందుతున్నాను. నాకు దేవుడిచ్చిన శ్రావ్యమైన గొంతుతో దేవుని స్తుతించుటతోపాటు క్రీస్తే నిజదేవుడని సాక్ష్యమిచ్చు సువార్తను బోధిస్తున్నాను.

నేను 14 మంచి పాటల అల్బమ్స్ తయారు చేసాను. ఆ పాటలలో ఆరాధన స్తుతి, సాక్ష్యము తెల్పు భావాలతో అర్థవంతంగా భావంలో క్రీస్తు మంచి లక్షణాలు ప్రేమను గుప్పించాను. నాకు మంచి గుర్తింపునిచ్చిన యిష్టమైన పాట ప్రపంచముగా సంపాదించుకొని ఆత్మను పోగొట్టుకుంటే వచ్చు లాభమేమి ?

నా జీవితంలో బిల్లీ గ్రహంగారి పరిచర్యలో పాల్గొని పాడుటలో ఎక్కువ ఆనందాన్ని పొందాను. నా గానకచేరీల ఫలితంగా సేకరించిన విరాళాలను ప్రమాదాలలో ఆస్తులు కోల్పోయిన వారికి సహాయ సహకారాలందించు రిలీఫ్ పనులలో ఆర్థికంగా తోడ్పడతాను. యువకులకు, వనితల సంక్షేమానికి కృషి చేయుటలో ఆనందిస్తున్నాను. నా జీవిత దృక్పథంలో ఒక నిజ క్రైస్తవునిగా నా జీవితమే మంచి సాక్ష్యంగా ఉండాలని, నా చుట్టూనున్న వ్యక్తులను నా సాక్ష్యంతో క్రీస్తు ప్రేమను ప్రభావితం చేయాలని నా ఆశయము. నాకు దేవుడు నా హృదయంలో మీడియా స్నేహితులకు పరిచర్య చేయు భారాన్నుంచారు. నా జీవితంలో నన్ను ప్రభావితం చేసింది నా ప్రియమైన సతీమణి రెబ్కా అంకిత భావంలో క్రీస్తును ప్రేమిస్తున్న గొప్ప ప్రేమ. ఆమె నాకు మంచి స్నేహితురాలు. ప్రతి పనిలో నా భార్య సంపూర్ణ సహకారం నన్ను ఉత్తేజ పరుస్తుంది. నాకన్నా ఆత్మీయంగా చాలా పరిపక్వత చేరిన విశ్వాసిగా నిలిచి నన్ను నా సేవను ప్రోత్సాహపర్చుట దేవుని కృప. నా భార్య, ఆమె తల్లిదండ్రులు నా ఆత్మీయ జీవితానికి జీవం పోసారు.

నా కుటుంబము యెహోషువా వలె నేను నా కుటుంబము దేవుని సేవిస్తున్నామని చాటి చెప్పుచున్నాము. నాకిద్దరు కుమారులు ప్రభువు బహుమతిగా యిచ్చారు. నేటికి వారి వయస్సు 20 సంవత్సరాలు 15 సంవత్సరాలు రూబెల్ జోష్, రాయల్ జోష్‌లు దేవుని ప్రేమలో పెరుగుచున్నారు. నేను చేస్తున్న సంగీత పరిచర్యలో గణనీయమైన సేవలందించుట నా భాగ్యం.

### నా రక్షణకాధారము

నేను నమ్మిన నా క్రీస్తులో పరిచయము చాలా కఠిన పరిక్షా సమయములో జరిగింది. నా చిన్న తమ్ముడు జర్మనీలో వ్యాపారంలో నుండగా ప్రమాదవశాత్తు అతని వ్యాపారస్తుల గొడవల సమయములో హత్యకు గురయ్యాడు. పోలీసులకు ఫోను చేయు ప్రయత్నంలో కాల్పులచే చంపబడుట నాకు చాలా దుఃఖాన్ని కల్గించింది. అప్పటికే నాకు బోలెడు ధనముంది, పేరుంది. వ్యాపార మెళుకువలున్న జ్ఞానముంది. కానీ ఒక ప్రాణం విలువ అన్నిటికన్నా విలువైనది. ఒక కుటుంబములో ఒక వ్యక్తి మరణం ఎందరినో దుఃఖాక్రాంతుల్ని చేసి తీరని బాధకు గురిచేస్తుంది.

ఆ బాధ అనుభవించినవారికే రక్త బంధువులకే పరిమితం. బాధించిన వారి పట్ల ద్వేషం, భరించరాని దయ గుండెల్ని పిండేస్తుంది. నా తమ్ముడు అతని లోటుతో నా దుఃఖం తగ్గించు కొనుటకు ఎన్నో తీర్ధయాత్రలు, క్రొత్త ప్రాంతాలు, క్రొత్త వ్యక్తుల ఆదరణ యివన్నీ నాలో దుఃఖం, కన్నీరును తగ్గించలేదు. నాలో కల్గిన తీరని వ్యధను గుర్తించి క్రీస్తును ప్రేమించిన విశ్వాసులలో ఒక్కరు నన్ను క్రీస్తుకు పరిచయం చేసారు. కన్నీరు తుడిచి, గుండె బాధల్ని తీర్చి పాపాల్ని క్షమించి నిత్య జీవాన్నిచ్చే క్రీస్తునే రక్షకుడు లోకానికి వెలుగుగా వచ్చారని మార్గము సత్యము జీవము ఆయనేనని చెప్పారు. నేనెంతో విద్యాభ్యాసం వల్ల జ్ఞానాన్ని పొందాను జ్ఞానమునకు మించిన గొప్పజ్ఞానం నిండిన గ్రంధం బైబిలుగా గ్రహించాను. సమస్త జ్ఞానమునకు మించిన సమాధానము నిచ్చే గ్రంధము బైబిలు. సమస్యలన్నింటికి జవాబు నిచ్చే గ్రంధము బైబిలు. నా తమ్ముడిని హత్య చేసిన వారిని క్షమించగల్గిన ప్రేమ నందించింది క్రీస్తు కల్వరి ప్రేమ. వీరేమి చేస్తున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించమన్న క్రీస్తు ఆప్యాయత, స్తెఫనును రాళ్ళతో కొట్టినప్పుడు క్షమించిన ప్రేమ నన్ను మార్చింది. ఆ క్రీస్తును రక్షకునిగా స్వీకరించిన నాటి నుండి క్రీస్తు కొరకై జీవించుటకు ఆరంభించాను. నా సంపదను లక్ష్య పెట్టలేదు. క్రీస్తే నాకు సంరక్షకు డయ్యారు. నా సమయము, తలాంతులు సంపద క్రీస్తునకే అంకితం చేసాను.

క్రీస్తు అన్ని ప్రార్ధనలకు జవాబునిచ్చు గొప్ప దేవుడని నమ్మాను. గత 12 సంవత్సరాలుగా ప్రపంచమంతా తిరిగి క్రీస్తే రక్షకుడని పాటలు ద్వారా, సందేశం ద్వారా అనేకులకు సాక్ష్యమివ్వగా వరమానందం పొందు ధన్యత లభించింది. క్రీస్తు మెల్లని స్వరం నన్ను నడిపిస్తుంది. నా జీవితానికొక పాటనిచ్చారు, సాక్ష్యాన్నిచ్చారు. నేను నా జీవిత కాలమంతా ఆరాధిస్తూ, కీర్తిస్తూ సాగిపోగలను.



నా పాటలలోని భావాలను అందరూ అభినందిస్తూ క్రీస్తును ప్రేమిస్తున్నారు. ప్రభూ, యేసూ, నీవే మహాత్మ్యము గల క్రీస్తువు. నీవంటి వారెవరున్నారు? ఎవరూ లేరు. నా జీవితం లోకి వచ్చావు నాకు ముక్తిని ప్రసాదించావు.

నేను పాపిని. నన్ను రక్షించి నడిపిస్తున్నావు. యేసయ్యా, నీవు నిన్న నేడు రేపు ఏకరీతిగా ఉండువాడవు. మారని దేవుడవు హల్లెలూయా. నీకే స్తోత్రము. నిరాశ నుండి సమస్యల నుండి పూర్తిగా రక్షించ సమర్ధుడు. గతంలో నేను పాప్‌సింగర్‌గా, ఫిల్మ్ సింగర్‌గా ప్రజల ముందున్నాను. ఇప్పుడు గాస్పల్ సింగర్‌గా ధైర్యంగా నిలబడి వేలాది జనములకు క్రీస్తే దేవుడని చాటి చెప్పు ధన్యత నిచ్చారు. హల్లెలూయ. క్రీస్తు కృంగిన వారిని లేవనెత్తువాడు. బాధితులను ఆదుకొను ప్రేమామయుడు. నన్ను రక్షించాడు. నాలో మంచిని వెదికి కనుగొన్నాడు. క్రైస్తవం మతం కాదు, మార్గమే! సజీవుడై నడిపించే దేవుడు మనకున్నాడు. ఎటువంటి శ్రమలో నున్నను, క్రీస్తుకు నిన్ను పూర్తిగా మార్చి వేసి కోరిన రీతిగా వాడుకొని శక్తి సమర్ధత ఉందని గుర్తించావా? నీకు సమ్మతి గల మనస్సు నిచ్చి ధృఢపరుస్తారని విశ్వసించుచున్నావా?

నీకు ప్రస్తుతమున్న అనుభవాల నుండి విడుదలనిచ్చి విడిపించి గొప్ప స్థితిలో నుంచగల మంచి దేవుడని ఆయనను చేరి ప్రార్ధించి జవాబు పొందు. పాఠకా! నాకు ప్రపంచంలో కోరిన గొప్ప జీవితం కన్న క్రీస్తులో నన్ను శాంతి చాలా గొప్పదని నేను గ్రహించాను. నీకట్టి అనుభవము కావాలని నా దీన ప్రార్ధన. పరిశుద్ధాత్మ ప్రభువా! స్వామీ, మా మధ్యకు దిగుమా ఆత్మ వశులను చేసి అభిషేకించుమయ్యా ఆమెన్. హల్లెలూయ

**(శ్రీమతి గ్రేస్ విజయగారి "భూదిగంత యేసుసాక్షులు" పుస్తకం నుండి)**



ఆచార్య ఆరార్కే

రేడియో పాఠం

# ప్రకటన గ్రంథ పరమ సత్యాలు

సంఘానికి క్రీస్తు శాశ్వతమైన పునాది. సంఘజీవితంలో యేసు ప్రముఖపాత్ర వహిస్తున్నాడు. సంఘమును గురించి సంఘవిజయాన్ని గురించి క్రీస్తు అధిక శ్రద్ధ వహిస్తున్నాడు. సంఘ యజమాని, సంఘ శిరస్సు యేసే. సంఘబిడ్డలు యేసుక్రీస్తుకు ఎంతో ముఖ్యులైన ప్రజలు. సంఘవిజయాన్ని గూర్చి యేసుక్రీస్తు మనకు హామి ఇస్తున్నాడు. సిలువ మీదు యేసు విమోచన కార్యం ముగించాడు. కాని సంఘం భూదింగంతాల వరకు సాక్షి. ఈ సంఘ కార్యక్రమం ఇంకా ముగియలేదు. సంఘనిర్మాణం కొనసాగుతూనే వుంది.

ఏడు సంఘాలు మొదటి అధ్యాయంలో పేర్కొనబడ్డాయి. ఎఫెసు, స్ముర్న, పెర్గము, తుయతైర, సార్థిస్, ఫిలిదెల్ఫియా, లవొదికయ. ఈ సంఘాలకు యేసుక్రీస్తు ఉత్తరాలు వ్రాసాడు. ఎఫెసు ప్రథమ ప్రేమను విడిచింది. స్ముర్న శ్రమపడిన సంఘం, పెర్గము లోకంతో రాజిపడిన సంఘం. తుయతైర చెడుగును సహించిన సంఘం. సార్థిస్ సగం మృతమైన సంఘం. ఫిలిదెల్ఫియా విధేయత గల సంఘం. లవొదికయ నిష్ప్రయోజక సంఘం.

యోహాను సువార్త 17వ అధ్యాయంలో యేసు తన సంఘం కోసం చేసిన మహా ప్రార్థన వ్రాయబడి వుంది. ఈ సంఘమును దేవుడు తన కుమారునికి ఇచ్చాడు. ప్రకటన 3వ అధ్యాయం తరువాత సంఘం ఇక్కడ కనిపించదు. 4వ అధ్యాయం వరకు సంఘం 19 సార్లు పేర్కొనబడింది. 4 నుండి 20వ అధ్యాయం వరకు సంఘం ఒక్కసారి కూడా పేర్కొనబడి వుండలేదు. సంఘం ఈ లోకంలో ఉండదు, ఎత్తబడి వుంటుంది. ఈ ఏడు సంఘ లేఖలు వినేటప్పుడు పాఠకులు గమనించవలసిన కొన్ని సూత్రాలు ఉన్నాయి. ఈ సంఘములున్న ప్రదేశాలు వాస్తవికమైనవి. యోహాను ఈ ఏడు సంఘాలను బాగా ఎరుగును. అప్పుడెప్పుడో ఉన్న సంఘాలైనా, ఆ ప్రదేశాలను మనమిప్పుడు చూడవచ్చు. శిథిలాలైనా అవి మనతో మాట్లాడుతున్నాయా! అనిపిస్తుంది. ఇవి స్థానిక సంఘాలు. ఈ సంఘములలో ప్రతీది ప్రత్యేకమే అయినా సందేశం అన్ని కాలాలకు వర్తిస్తుంది. ఉదాహరణకు పెర్గము సంఘానికి వ్రాసిన ఉత్తరమే అయినా అది నీకు నీ సంఘానికి కూడా వర్తిస్తుంది.

పెంతుకోస్తునుండి రెండవ రాకడ వరకు మేడ గదినుండి మధ్యాకాశం వరకు సంఘటనలు క్రమంగా ఒకదాని వెంబడి ఒకటి జరుగుతాయి.



ఎఫెసు అపొస్తలిక సంఘం. లవొదికయ తప్పిపోయిన సంఘం. ఈ రోజున ఈ సంఘ సమాచారాలు సంఘ చరిత్రలో భాగమైపోయాయి. ఈ ఉత్తరాలలో మొదట యేసుప్రభువు తన మహిమను సూచించే పరిచయ వాక్కులు పలుకుతాడు. సంఘదూతకు అనగా స్థానిక సంఘకాపరికి ఉత్తరం వ్రాయబడిందని చెప్పబడింది. నేను నీ క్రియలు ఎరుగుదును అంటూ ఉత్తరం మొదలవుతుంది. సంఘంలోని మంచి లక్షణాలు మెచ్చుకుంటాడు. లోపాలను గద్దిస్తాడు. స్ముర్న, ఫిలదెల్ఫియా సంఘాలలో లోపాలేమి లేవు గనుక అవి పేర్కొనబడలేదు. స్ముర్న హతసాక్షి సంఘం. ఫిలదెల్ఫియా సువార్తను నమ్మకంగా ప్రకటించే సంఘం. లవొదికయలో మెచ్చుకోదగిన ఒక్క మంచి లక్షణమూ కనిపించదు. ఆత్మ చెప్పే మాట చెవిగలవాడు వినును గాక! అని ప్రతి ఉత్తరంలోనూ ప్రభువు అంటూనే ఉన్నాడు. ప్రతి సంఘానికి ప్రత్యేకంగా వ్యక్తిగతంగా వ్రాసిన ఉత్తరం. లేఖాసాహిత్యంలో ఇవి కళాఖండికలని చెప్పాలి. ఎఫెసు సంఘానికి యేసుప్రభువు ఉత్తరం వ్రాసాడు. అపోస్తలుడైన పౌలు కూడా ఎఫెసీ పత్రిక వ్రాసాడు. ఎఫెసీ పత్రికలు రెండు ఉన్నాయి. రోమా రాజ్యంలో ఈ ఏడు స్థలాలు ఎంతో కీలకమైనవి, తూర్పు పడమరల సంగమ కేంద్రాలు. క్రీ.పూ 2000సం॥లో ఈ సంఘ ప్రదేశాలలో ఒక కొత్త సంస్కృతి వాడుకలోకి వచ్చింది. అది టర్కీ పడమటి తీర ప్రదేశం. హిత్తీయ సంస్కృతి ప్రభావం అక్కడ ప్రజలపై పడింది. ఈ ప్రదేశాలు అలెగ్జాండర్ కాలం నాటికి బాగా అభివృద్ధి చెందాయి. అనాటోలీయ గ్రీకు సంస్కృతుల సమ్మేళనమది. ఎఫెసు పట్టణ జనాబా రెండులక్షలు. అక్కడ ఒక పెద్ద బహిరంగ నాటకశాల ఉంది. ఇరవైవేలమంది కూర్చొనే వసతి ఉంది. తెల్లటి చలువరాతి భవనాలు ఉన్నాయి. అన్యదేవాలయాలు ఎక్కువగా ఉన్న ఆ పట్టణం సువార్తతో నింపబడడం గొప్ప విశేషం. అ.కార్య 19:10లో "యూదులేమి గ్రీసుదేశస్థులేమి, ఆసియలో కాపురమున్నవారందరు ప్రభువు వాక్యం విన్నారు."

ప్రకటన 2:1-7

ఎఫెసులో ఉన్న సంఘపు దూతకు ఈలాగు వ్రాయి. ఏడు నక్షత్రములు తన కుడిచేత పట్టుకొని ఏడు దీపస్థంభముల మధ్య సంచరించేవాడు చెప్పే సంగతులేవనగా నీ క్రియలను, నీ కష్టమును సహనమును నేనెరుగుదును. నీవు దుష్టులను సహింపలేవని అపొస్థలులు కాకుండానే తాము అపొస్థలులుమని చెప్పుకొనేవారిని పరీక్షించి వారు అబద్ధికులని నీవు కనుగొన్నావని నీవు సహనము కలిగి నా నామము నిమిత్తము భారము భరించి అలయలేదని నేనెరుగుదును. అయినను మొదట నీకుండిన ప్రేమను వదిలావని నేను నీ మీద తప్పు ఒకటి మోపవలసి ఉన్నది. నీవు ఏ స్థితిలోనుండి పడిపోయావో అది జ్ఞాపకము చేసుకొని మారుమనస్సు పొంది ఆ మొదటి క్రియలను చెయ్యి. అట్లు చేసి నీవు మారుమనస్సు పొందితేనే సరి, లేనియెడల నేను నీ యొద్దకు వచ్చి నీ దీపస్థంభమును దాని చోటునుండి తీసివేస్తాను.

ఎఫెసు పట్టణంలో పౌలు సేవ చేశాడు. అక్కడి సంఘంలో యోహాను కాపరిగా, నాయకుడుగా సేవచేశాడు. ఆసియా మొత్తంలోకి ఎఫెసు గొప్పనగరం. దానికి ఆసియా మాయాబజారు అని కూడా పేరుంది. ఆసియా వెలుగు అని ఆ పట్టణాన్ని యాత్రికులు ప్రశంసించారు. మతవిషయాకంగా, వ్యాపార రీత్యా ఎఫెసు పేరెన్నికగన్న నగరం. ఆసియా, ఐరోపా తూర్పు పడమరల మేలు కలయిక ఈ ఎఫెసునగరం అని అందరూ గొప్పగా చెప్పుకొనేవారు.

(సశేషం)

**ఆరార్కే గారికి నివాళి - మరో ప్రత్యేక సభ**

*సువార్త గాయకులు డా॥ జాన్ బిల్మోరియా గారు ఆరార్కే గారు పరమపదించిన సమయంలో విదేశాల్లో సేవలో ఉన్నారు. ఆగస్టు **31** న ఇండియాకు రానున్నారు. సికింద్రాబాద్ పెద్ద సభ ఒకటి ఆరార్కే గారి నివాళిగా సెప్టెంబరు **29**న నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలు డా॥ జాన్ బిల్మోరియా గారికి ఫోన్ **9848055073 / 8790612660** చేసి తెలుసుకోవచ్చు! లేదా స్పందనకు ఫోన్ చేయండి. రాగలిగిన వారందరూ తప్పక రావాలని మీకు ఆహ్వానం పలుకుతున్నాము.*

*-సంపాదకులు, స్పందన*



డా॥మిచ్ మెదీనా

## నేను మీకు చూపించనున్న
# ఇదే సర్వోత్తమమైన మార్గం

అనువాదం
ఆచార్య ఆరార్కే మూర్తి

**ముందుమాట :**

సర్వోత్తమ మార్గము అనే శీర్షికతో వెలువడుతున్న ఈ చిన్న - పెద్ద పుస్తకం ఈ అంశం మీద వెలువడిన గ్రంధాలలో సర్వోత్తమమమైనది. అని నేను ఘంటా కంఠంతో చెప్పగలను. ఎందుకంటే, రచయిత మామూలు వ్యక్తి కాడు. యూదా మతం నుండి రక్షించబడి వచ్చిన విశ్వాసి. దేవుడు ఈ రచయితను, పలు విధాల సావర్తిక ఉద్యమాలలో ఎంతో బలంగా వాడుకుంటూ ఉన్నాడు. ఈ గ్రంధంలో రచయిత స్వానుభవాలు, విశ్లేషణాత్మకంగా రాయబడి ఉన్నాయి. "విశ్వాస శక్తి చేత - విశ్వాసి పరిపక్వతను కొలువలేము. నిరీక్షణా బలం చేతనే పరిపక్వత ఋజువవ్వుతుంది." అని అధికారపూర్వకంగా చెప్పగలిగిన రచయిత, సమకాలీన క్రైస్తవ సాహిత్యంలో ఈయన ఒక్కడే నాకు కనుబడుతున్నాడు. దేవుని వాక్యాన్ని, ఈయనెంతో చక్కగా విడమరచి చెప్పుతాడు.

*లోగోస్ :* రేమా, గ్రాఫే అనే మూడు విధాల దైవ వాక్కును విడమరచి చెప్పగలిగిన రచయిత. ఎడతెగక ప్రార్ధంచడం అంటే ఏమిటో, తన స్వంత సాక్ష్యం ఆధారంగా కండ్లకు కట్టినట్లు చూపగలిగిన రచనాశిల్పి. దేవుని ఆత్మ ఈ రచయితను, నింపి ఈ గొప్పగ్రంధాన్ని వ్రాయించాడని నా ప్రగాఢ విశ్వాసం. పాఠకులు ఈ పుస్తకాన్ని ఆధ్యాత్మిక అభ్యాస గ్రంధంగా ఉపయోగిస్తారని, ఇందలి సత్యాలను ఆచరించి అద్భుతాలు చేయగలుగుతారని, రచయితతో బాటు, నేను నొక్కివక్కాణిస్తున్నాను. అనువక్తగా నేను ఎన్నో మంచి అనుభవాలు ఈ గ్రంధం ద్వారా పొందానని, మీరు కూడా, అట్టి ఆశీర్వాదాలు అనుభవిస్తారని నిరీక్షిస్తూ ఈ చక్కని ప్రయోజనాత్మక, ప్రయోగాత్మక గ్రంధాన్ని మీ చేతుల్లో ఉంచుతున్నాను. దైవాశీస్సులు. ఆమేన్.

క్రీస్తునందు సేవలో
**ఆచార్య ఆరార్కే మూర్తి**

**మీకు పటిష్టమైన ఆధ్యాత్మిక అనుభవైక వేద్యం కావాలంటే, నీ జన్మహక్కు తెచ్చిన శక్తితో నడవాలంటే క్రీస్తునందు నిలిచి ఉండాలంటే, యేసులాగే తండ్రి జీవం పంచుకోవాలంటే ఈ పుస్తకము నీకోసమే! ఇది మరో తియాలజి వ్యాసం కాదు. మోరిస్ సెరుల్లో ఈ పుస్తకం తొలిపలుకుల్లో అన్నట్లు ఈ పుస్తకం కేవలం అనుభవజ్ఞానం మీద ఆధారపడి రాసింది.**

**దేవుని యందు విశ్వాసం అంటే సాహసోపేతమైన ఆధ్యాత్మిక యాత్రకు ఆరంభం. నీ జీవితంలో దేవుడు నివివ్వజూపే ఆశీర్వాదాలు ఏవి? పాపముపై సంపూర్ణ విజయం. ప్రార్ధన, విశ్వాసం, నిరీక్షణ ప్రేమ అనే అంశాలను ప్రయోగాత్మకంగా అవగాహన చేసుకొనే సజీవశక్తి. "పని చేసుకుంటూ ఎడతెగక ప్రార్ధించగలవా? నాకు జలుబు చేసింది, దీన్ని వదిలించుకోలేకపోతున్నానే, మరి కొండలను పెకలించే విశ్వాసం నాకెలా అలవడుతుంది?" దినదినము ఎదురయ్యే ఇలాంటి వందలాది వాస్తవిక ప్రశ్నలకు ఈ పుస్తకంలో నీకు జవాబు లభిస్తుంది. ఈ పుస్తకం చదువుతూ ఉండగా నీకు ఈ ప్రయాణం గొప్ప సవాలు! ఈ పుస్తకం చదువుతున్న నీవు ఆధ్మాత్మిక లోతుల్లోకి వెళ్ళి, అభివృద్ధిని సాధించేందుకు, బైబిలు సూచించే విధానాలను అన్వేషించగలవు. ఈ విధాన ప్రక్రియలనే డా॥మెడీనా "సర్వోత్తమా మార్గం" అంటారు.**

## ఉపోద్ఘాతము

మనం ఆధ్యాత్మిక యాత్రలో అడుగుపెట్టబోతున్నాము. ఇది ఉద్రేక భరితమైన ప్రయాణము.

క్రైస్తవం ఈ ఇరవయ్యో శతాబ్దంలో దేవుడు మనకిచ్చిన వనరులను ఎన్నో పోగొట్టు కొన్నది. అయితే ఈ తరంలో పరిశుద్ధాత్మ దేవుడు సంఘానికి వాటిల్లిన నష్టాన్ని భర్తీ చేసి ఆమె ఆధ్యాత్మిక జన్మహక్కును తిరిగి ప్రసాదించగోరుతున్నాడు. సంఘ చరిత్రలో శతాబ్దాల తరబడి జన్మహక్కు నష్టమైపోయింది. సంఘం ఒక్కపూట కూటికోసం దాన్ని తెగనమ్ముకొన్న సందార్భాలు ఎన్నో కానవస్తున్నాయి.

యోహాను 2:12 నుండి 14 వరకు భక్త యోహాను క్రైస్తవ పరిపక్వతను మూడు అంతస్తులలో ఉంచి చూపుతున్నాడు. చిన్నపిల్లలు, యువకులు, తండ్రులు – ఈ మూడు ప్రత్యేక వయో విభాగాలు.

చిన్నపిల్లలు దేవుని ఎరుగుదురు. వారి పాపాలు క్షమించబడినవి. వారికి దేవుడే తండ్రి. ఈ వయస్సు క్రైస్తవ విశ్వాసములో సైద్ధాంతిక అనుభవాన్ని చూపిస్తున్నది. క్రైస్తవ విశ్వాసము ఈ అంతస్తు నందు అన్ని శాఖలలో శైశవ రూపంలో కనబడుతూనే ఉంది. ప్రొటెస్టెంటులు గాని, క్యాథలిక్ శాఖీయులు గాని బాల్యదశలో ఇలాగే ఉంటారు. దిద్దుబాటు ఉద్యమం కన్నబిడ్డలు వీరు. దేవుని గురించి కొన్ని విషయాలు తెలుసుకొంటే రక్షణ కీలకం తెలిసి ఉంటే చాలును అనుకొనే దశ. ఇది కేవలము ఆరంభ బిందువు మాత్రమే.

అ.కార్య 16:31 చెప్పినట్లు ప్రభువైన యేసునందు విశ్వాసముంచితే రక్షింపబడతారు. ఈ వచనములో రక్షణ విశ్వసించిన తదుపలి కలిగే అనుభూతి. అంతే కాని విశ్వసించడం రక్షణ కాదు. రక్షణ పరిధిలోకి ప్రవేశించడానికి విశ్వాసం ఒక ద్వారం మాత్రమే.

యోహాను పత్రికలో మరో వయో విభాగము ప్రస్తావించబడింది. ఇందులో యువకులు ఉన్నారు. వీరు బలవంతులు దుష్ట సైతానును గెలిచినవారు. అయితే నేటి సంఘంలో ఈ వర్గానికి చెందినవారు అంతగా కనిపించరు.

పెంతకొస్తు శాఖీయులు తమే ఆధ్యాత్మిక శీలం కలిగినవరము అనుకోవచ్చు. గాని వారిలో కూడా ఇలాంటి ఆధ్యాత్మిక యవత అట్టే కనిపించడము లేదు. పాపముపై విజయము సాధించిన వారు ఎవరో పేరు మ్రోగిన కొద్దిమంది బోధకులు మాత్రమే. ఈ వయో విభాగము లేదేమో అన్నట్లు బోధకులు బుజువు చేస్తున్నారు. ఈ వార్త అంతటా అంటు జాడ్యంలాగా ప్రసరిస్తున్నది.

ఒక సంఘంలో బోధించేటప్పుడు ప్రసంగికుడికీ కొట్ట వచ్చినట్టు కనిపించే వాస్తవము ఇదే. సంఘ సభ్యులలో ఇంచుమించు సగంమంది స్త్రీ, పురుష సంబంధాలలో సమస్యలు తెచ్చిపెట్టుకుంటున్నట్లు కనిపిస్తున్నది. లైంగిక అవినీతి వివాహ వ్యవస్థకు బయట ప్రవర్తిల్లుతున్నది.

యువతీ యువకులు కలిసి మెలిసి విచ్చల విడిగా తిరగడం పరిపాటి అయిపోతున్నది. వివాహితులైన మధ్య వయస్కులు కూడా అసత్యము, అశ్లీలము అయిన వ్యాసంగాలు పెట్టుకుంటున్నారు. వ్యభిచరిస్తున్నారు. అసభ్య శృంగారాన్ని చిత్రించే బొమ్మలు చూస్తున్నారు. పాపము మీద విజయము అల్లంత దూరాన ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే నిర్దిష్టమైన విజయము సాధించలేకపోతున్నారు. యువత అంతస్తుకు సంఘాలను పెంచలేని అధమస్త స్థితి దాపురించింది.

ఇకపోతే ముదవ వయో విభాగము గమనించాలి. ఈ వర్గానికి చెందిన వారు సంఘంలో బహు కొద్దిమంది. ఇలాంటి వారిని ఉత్పత్తి చేయగల బోధన పరిచర్య కూడా కరువైపోయింది. ఈ చివరి తరంలో పరిశుద్ధాత్మ ఏమి చేస్తున్నాడు? ఎలాంటి మచ్చ, ముడత, కళంకము లేని వధువును స్థిరపరుచు కోవాలని చూస్తున్నాడు. ఎఫెసీ 5:27. సంఘం పరిపక్వతను పుంజుకోవలి. సంఘ నాయకత్వము విశ్వాసమందు తండ్రులు అయి ఉండాలి. ఇది కనీసపు అక్కర. విశ్వాస పితరులు అనే ఆధ్యాత్మిక పరిమాణము సంఘానికి ఉండి తీరాలి. నాయకత్వము ఇదే దృక్పధానికి అంకితమై పోవాలి. సేవలో ఉన్నవారే కాదు క్రైస్తవులందరు ఆది నుండి ఉన్నవానిని ఎరిగి ఉండాలి. క్రీస్తు నందు వారి వయస్సు ఎంత అని కాదు క్రైస్తవ ప్రవర్తనలో ఎడతెగని దివ్య జ్ఞానము వారి యందు కానరావాలి. వారి ప్రవర్తన తండ్రిని ఎరిగిన సౌశీల్యాన్ని కనపరచాలి. ఇలాంటి వారే యేసుప్రభువు రాకడలో ఆధ్యాత్మిక శిఖరాన్ని అధిరోహిస్తారు. ప్రార్థన, విశ్వాసం, నిరీక్షణ, ప్రేమ అనే సందేశాలు వారిని ఉద్దేశించినవే! వినయ భావంతో ఈ ప్రబోధాలను వారికి అంకితము చేస్తున్నాము. ఇలాంటి పరిపక్వత వారికి గట్టి పునాదిగా ఏర్పడుతుంది. వారు అంతమువరకు సహించగల్గుతారు. వారే రక్షింపబడినవారు. మత్తయి 10:22; 24:13.

అపొస్తలుడైన పౌలు 1 కొరింథీ 2:6 నుండి 7 వరకు మరో క్రైస్తవ అనుభవాన్ని పేర్కొంటున్నాడు. ఇది అన్నిటికంటే ఉన్నతమైనది, అప్పుడూ ఇప్పుడూ కూడా ఈ అంతస్తును చేరుకొన్నవారు బహుకొద్ది మంది. ఆత్మవరాలను మించిన అనుభవము 1 కొరింథీ 12:31లో ప్రస్తావించబడింది. కృపావరాలలో శ్రేష్టమైన వాటిని ఆసక్తితో అపేక్షించండి. ఇది గాక సర్వోత్తమ మార్గం మీకు చూపుతాను. 1 కొరింథి 13 ఒక చిన్న ప్రేమ కావ్యం. అందులో పౌలు సర్వోత్తమ మార్గాన్ని అభివర్ణిస్తున్నాడు. అన్నిటికంటే గొప్ప ప్రత్యక్షం ప్రేమే. ఈ ఆధ్యాయం ముగింపులో మూడు ప్రాముఖ్యమే సుగుణములను పేర్కొంటున్నాడు. ఈ మూడు అధ్యాత్మిక శక్తికి వ్యక్తీకరణ లక్షణాలు.

లూకా 8:46. సర్వోత్తమ మార్గానికి వచ్చిన వ్యక్తి తన ప్రవర్తనలో ఈ మూడు లక్షణాలను చూపగలడు. 1 కొరింథి 13:13 –విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ ఈ మూడు నిలిచి ఉంటాయి. వీటిలో శ్రేష్టమైనది ప్రేమ.

పౌలు చెప్పిన ప్రకారం ఈ గ్రంథ శీర్షికను మూడు భాగాలు చేసాము. 1 కొరింథి 12, 14 అధ్యాయాలలో ఉన్న క్రమం ఇదే. ఆత్మవరాలను వినియోగించి సంఘ పరిచర్య ధర్మం జరగటానికి దోహదపడే విధానం అవలంబించాము. పరిపక్వత దృష్ట్యా పౌలు ఈ ప్రబోధాలు చేసాడు. ఆత్మవరాల వినియోగం ఎంతో అవసరము. అయితే వాటన్నిటిలో ఎక్కువగా విస్మరించబడిన అంశాన్ని ఎత్తి చూపుతున్నాము. ఇరవయ్యో శతాబ్దపు పెంతెకొస్తు ఉజ్జీవంలో ఇది కేంద్రసత్యమై ఉండాలి. ప్రజలు దీనిని గుర్తించాలి. అన్నిటికంటే “సర్వోత్తమ మార్గం” మనకిప్పుడు అనుసరణీయం.

ఉపోద్ఘాతాన్ని ఇంతటితో విరమిస్తాను. ‘ఎడతెగని ప్రార్థన’ అనే అంశం మనముందు ఉంది.

(ఎడతెగని ప్రార్థన అనే అంశంతో వచ్చే సంచికలో...)

## జులై గ.ను.క అల్‌కరెక్ట్‌గా వ్రాసిన వారి పేర్లు

బి.అనీమేరి-హైదరాబాదు, యం.నిర్మలసుదీప్‌రెడ్డి-కొండపల్లి, కె.విజయ-తెనాలి, బి.ఏలీషారావు-గుడివాడ, సి.హెచ్.కస్తూరిబాయి-చీరాల, హెచ్.భాస్కర్-బళ్ళారి, బి.కెంపురత్నకుమారి-వరంగల్, లీలావతిశామ్యూల్-చెన్నై, దేవకుటుంబరావుసరోజిని-విశాఖపట్నం, యన్.అరుణకుమారి-గిద్దలూరు, బి.నాగమణి-గంపలగూడెం, యం.రత్నకుమారి-అమ్మిరెడ్డిగూడెం, బి.మణిజయప్రకాష్-అమ్మిరెడ్డిగూడెం, జె.సౌందర్యకళ-పలమనేరు, యమ్.దేవకృప-హన్మకొండ, బి.కె.శ్యామలాదేవి-కర్నూలు, బి.యన్.హేమలతపాల్-మదనపల్లి, ఆర్.జయమ్మలాబాను-గుంతకల్లు, టి.సువర్ణరాజరత్నం-కడప, యమ్.మనితాప్రభాకర్-నంద్యాల, వై.మేరీప్రమీల-హిందూపురం, కె.సుధారాణి-అమ్మపాలెం, జె.సరోజిని-రాజమండ్రి, బి.కృపానందం-నరసాపురం, యన్.సత్యనారాయణ-వైజాగ్, కె.కనకమ్మ-హన్మకొండ, యస్.జాషువామాథ్యూస్-ఒంగోలు, జి.రాజారావు-సామర్లకోట, బి.జయబాబు-కర్నూలు, టి.శోభారాణి-హన్మకొండ, యమ్.సి.మనోహరమ్మ-అనంతపురం, హెచ్.సరళమ్మ-గిద్దలూరు, హెచ్.ఫ్లోరెన్సమ్మ-చిన్నదొర్నాల, ఆర్.యమ్.విజయకుమారి-మదనపల్లి, కె.క్రీస్తుదాసు-చిన్నదొర్నాల, జి.ప్రమీలాసుందర్-హన్మకొండ, హెచ్.చంద్రప్రభ-సింగరాయకొండ, యమ్.ఝాన్సిశాంతకుమార్-హన్మకొండ, జె.స్వామినాథన్-కుప్పం, వై.కె.యల్.సుగుణమ్మ-బద్వేల్, కె.విమల-కొత్తవలస, వి.భాగ్యలక్ష్మి-విశాఖపట్నం, వై.మాణిక్యమ్మ-కంచికచర్ల, కె.శశీల్య-కంచికచర్ల, వై.ఎస్తేరమ్మ-కంచికచర్ల, ఎ.మునిరాజు-కడప, యస్.యఫ్.త్యాగరాజు-బెల్లంపల్లి, ఆర్.రాజమణి-తాడేరు, డి.డి.డి.ఎ.మణి-విశాఖపట్నం, మేరీకమలరత్నం-హిందూపురం, వి.యల్.ప్రసూనాంబ-గుంటుపల్లి, కె.జె.మార్గరేట్‌పద్మాకర్-గుత్తి, జి.విమలాప్రభావతి-30, వై.మరియమ్మ-చెన్నై, జి.కె.విజయసుధ-గిద్దలూరు, పి.రఘురామయ్య-కర్నూలు, దీనమ్మక్రిష్టఫర్-హన్మకొండ, కె.యస్.లలితాభాయి-కలసపాడు, మార్తాయేసుదాన్-జమ్మలమడుగు, నశీలామనోహర్‌రాజ్-నంద్యాల, కె.సులోచనాదేవి-ఒంగోలు, యమ్.స్వర్ణలతాఏంజల్-కర్నూలు, బి.శాంతకుమారి-కడప, పి.దేవదానం-నంద్యాల, జి.రిబ్కమ్మ-కలసపాడు, బి.వనజకుమారి-వరంగల్, డి.సుందరరాజన్-కుప్పం, యస్.మెర్సీలారెన్స్-కాకినాడ, జి.పాల్-కలసపాడు, జేన్‌ఆనందరావు-చిత్తూరు, టి.దేవకుమారి-చెవుటూరు.

ఒక తప్పుతో వ్రాసినవారు: జయంతిస్టీవెన్-హైదరాబాదు, బి.సరోజని-గుంతకల్లు, జి.గ్రేసమ్మ-నంద్యాల, టి.ప్రసాదు-రైల్వేకోడూరు, టి.కృపానందం-చెన్నై, యస్.యఫ్.కస్తూరిభాయి-మదనపల్లి, డి.సామ్యూల్-మంగుళూరు, యమ్.రాజమ్మ-కడప, బి.అంబుజ-హన్మకొండ, ఆర్.జి.సుశీలాఆండ్రూస్-పుంగనూరు, పి.యస్.భాగ్యవతమ్మ-గిద్దలూరు,.



ప్రసంగ వేదిక

# క్లుప్త ప్రసంగాలు

## వెలుగు

| | |
|---|---|
| 1. నిజమైన వెలుగు. | 1 యోహాను 2:8 |
| 2. గొప్ప వెలుగు. | మత్తయి 4:12-16 |
| 3. జీవపు వెలుగు. | యోహా 8:12 |
| 4. ఆశ్చర్యకరమైన వెలుగు. | 1 పేతురు 2:9 |
| 5. తేజోమయ జ్యోతి. | 2 కొరింథీ 4:5 |
| 6. నిత్యమైన వెలుగు. | యెషయా 60:19 |
| 7. ప్రత్యక్షపరిచే వెలుగు. | యోహాను 3:21, ఎఫెసీ 5:13 |

## భక్తిహీనులు

| | |
|---|---|
| 1. వారి యింటిమీదికి శాపము వచ్చును. | సామె 3:33 |
| 2. వారి మార్గము గాఢాంధకారము. | సామె 4:19 |
| 3. వారి పేరు అసహ్యత పుట్టించును. | సామె10:7 |
| 4. వారి ఆలోచన పనికిమాలినది. | సామె 10:20 |
| 5. వారి ఆశ భంగమైపోవును. | సామె 10:28 |
| 6. వారు దేశములో నివసింపరు. | సామె 10:30 |
| 7. వారు స్థిరపరచబడరు. | సామె 12:3 |

## యెహోవా నాకు...

| | |
|---|---|
| 1. కాపరి. | కీర్తన 23:1 |
| 2. బలము. | యెషయా 12:2 |
| 3. వెలుగు | కీర్తన 27:1 |
| 4. చూపించును. | కీర్తన 59:10 |
| 5. ఆలోచనకర్త. | కీర్తన 16:7 |
| 6. ఆధారము. | కీర్తన 3:5 |
| 7. తోడైయున్నాడు. | యిర్మీయా 20:11 |

## తుదివరకు కలిగియుండుము

| | |
|---|---|
| 1. విశ్వాసమును. | హెబ్రీ 3:13-15 |
| 2. పరిచర్యను. | అ.కార్య 20:24 |
| 3. ఆసక్తిని. | హెబ్రీ 6:11,12 |
| 4. దేవుని క్రియలు. | ప్రకటన 2:26,27 |
| 5. సహించుట. | మత్తయి 24:13 |
| 6. ఉత్సాహము. | హెబ్రీ 3:6 |
| 7. తీర్మానము | కీర్తన 119:112 |

## తడవు చేయుట

| | |
|---|---|
| 1. లోతు | ఆది 19:16 |
| 2. మోషే | నిర్గమ 32:1 |
| 3. లేవీయుడు | న్యాయాధి 19:8 |
| 4. పౌలు | అ.కార్య 22:16 |
| 5. వాగ్దానము | యెహోషువ 18:3 |
| 6. మ్రొక్కుబడులు | ద్వితీ 23:21 |
| 7. ఇశ్రాయేలీయులు తడవు చేయలేదు. | నిర్గమ 12:39 |

## చూపు

| | |
|---|---|
| 1. విషపు చూపు | 1 సమూ 18:9 |
| 2. ఓరచూపు | యెషయా 3:16 |
| 3. అహంకారపు చూపు | సామె 6:17 |
| 4. మీదు చూపు | కీర్తన 131:1, సామె 30:13 |
| 5. మోహపు చూపు | మత్తయి 5:28 |
| 6. చిన్న చూపు | పరమ 1:6, అ.కార్య 6:1 |
| 7. జాలిగల చూపు | లూకా 22:61 |

(11వ పేజి తరువాయి)

ఎవరు యెహోవా యందు నమ్మిక వుంచుతారో వారు సీయోను పర్వతం వలె స్థిరంగా వుంటారు, కదలరు. మీ జీవితాలు కలవరాల మధ్యలో ఉన్నాయంటే దానికి గల కారణం దేవుని యందు స్థిరమైన విశ్వాసం లేదు గనుక. నీవు విశ్వసించిన యెడల కలవరపడవు.

ఒకసారి మార్త యేసుప్రభువును ఇంటికి పిలిచింది. మార్త చెల్లెలు మరియ యేసుప్రభువు పాదాల దగ్గర కర్చుని ఆ విశ్వాసహితమైన మాటలు వింటూ వుంది. అలా వింటూ వున్నప్పుడు మార్త వచ్చి యేసయ్య మీద విసుగుపడ్డట్టు మాట్లాడింది. ప్రభువు మార్త మార్త నీవు అనేక పనుల మీద కలవరపడుడూ వున్నావ్. నీ మనస్సులో సాతానుకి ఎందుకు చోటిచ్చావు. ఉత్తమమైనది ఒక్కటే అసలు ఉత్తమమైన దానిని విడిచిపెట్టి అనవసరమైన విషయాలను గురించి చింతిస్తున్నావు అని హెచ్చరించాడు.

యాకోబు వాళ్ల అన్నయ్యతో గొడవపడి ప్రాణభయంతో పారిపోయి వాళ్ళ మేనమామ ఇంటికి వచ్చివున్నాడు. దేవుడు వచ్చి ఒకరాత్రి యాకోబు, నీవు మీ సొంత ఊరికి వెళ్లిపో అని చెప్పాడు. యాకోబు తన ఊరికి బయలుదేరమని తన ఇంటివారితో చెప్పాడు. వాని భార్య నీ అన్నకు నీ మీద కోపం గదా ఎలా మరి? అని అడిగితే అవిశ్వాసానికి చోటియ్యవద్దు. దేవుడే వెళ్లమని చెప్పాడు అని యాకోబు జావాబు చెప్పాడు. కొంతదూరం వెళ్ళిన తరువాత యాకోబు హృదయంలో కలవరం ప్రారంభమయింది. తన అన్న సమాధానంగా వస్తాడో లేదోనని, తన పనివారిని పిలిచి తన ఆస్థిని రెండు భాగాలు చేశాడు. తన పనివారితో మీరు ఈ సగం ఆస్థితో మా అన్న వద్దకు వెళ్లి, మా అన్నకి ఇవ్వండి. ఆ తరువాత నేను వస్తాను. సరేనని తన పనివారు వెళ్ళారు. ఏశావు వాయిద్యాలతో ఎదురు వచ్చాడు. మా తమ్ముడు ఏడి అని అడిగితే అతను పంపిన ఆస్థిని ఇచ్చారు. ఏశావు అంటున్నాడు. నాకు సమృద్ధిగా ఆస్థి వుంది. వాడి ఆస్థికాదు వాడే కావాలి అంటున్నాడు. అయిననూ బలవంతంగా ఆ ఆస్థిని ఏశావుకు అప్పగించి వచ్చారు పనివారు. జరిగిన విషయమంతా చెప్పారు. యాకోబు అంటున్నాడు అతను సమాధానంగా వుంటే నా కష్టార్జితమును ఎందుకు ఇచ్చారు? అని అన్నాడు. హృదయం కలవరంతో నిండి వుంటే నీ కష్టార్జితం మరొకరికి అప్పగించబడుతుంది. యేసుప్రభువు అంటున్నాడు మీ హృదయాలను కలవరపడనీయకుడి. **"శాంతి మీకనుగ్రహించి వెళ్లుచున్నాను. నా శాంతినే మీకనుగ్రహించు చున్నాను. లోకమిచ్చునట్టుగా నేను మీకనుగ్రహించుట లేదు." - యోహాను 14:27,28.**

గమనించండి నా సమాధానం మీకు ఇస్తున్నాను అంటున్నాడు. లోకమిచ్చే సమాధానం కాదు. ఆయన ఇచ్చే సమాధానం ఎలా ఉంటుంది అంటే నడిసముద్రములో రాత్రి వేళ తుఫాను వచ్చింది. అలలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. ఆ పడవ సముద్రంలో మునిగిపోయే ప్రమాదం ఏర్పడింది. ఆ సయమంలో యేసుప్రభువు పడవలో పండుకొని నిద్రపోతున్నాడు. శిష్యులు కలవరపడి పోతున్నారు. శిష్యులు యేసయ్య వైపు చూచి మేము నశించిపోతున్నాము నీకు చింత లేదా అంటున్నారు. వీళ్ళు కలవరపడేది కాకుండా యేసయ్యని కూడా కలవరపరుస్తున్నారు. ఎదురుగా వున్న తుఫానుని చూచి గద్దించగానే సముద్రము నిమ్మళమయి పోయింది. అప్పుడు ఆయన శిష్యులు గాలి, సముద్రం కూడా ఈయనకు లోబడుతున్నాయంటే ఈయన ఎవరు? అని ఆశ్చర్యపడుచున్నారు. ఆ మన శక్తిని మనము విశ్వసించినప్పుడు ఆయన సమాధానం మనకు వస్తుంది.

దావీదు చనిపోక ముందు దేవుని మందిరము కొరకు సమస్త ఐశ్వర్యము సంపాదించాడు. అతని రాజ్యపాలనలో ఎప్పుడూ యుద్ధాలే. నెమ్మది లేని జీవితం. అందువలన అతని కాలములో కాక అతని కుమారుడైన సొలొమోను కాలములో దేవుని మందిరము కట్టబడింది. సొలొమోను కాలములో దేశమంతా సమాధానంతో వున్నది.

నా ప్రియమైన సహోదరులారా సాతానుకి మీ హృదయాలలో చోటివ్వకండి. దేవుడు చెప్తున్నాడు మీ హృదయములను కలవరపడనీయకుడి. నా సమాధానం మీకిచ్చి వెళ్తున్నాను. ఆ సమాధానం మిమ్ముల్ని పరిపాలించాలి. ఇప్పుడు మిమ్ముల్ని పాలిస్తుంది ఎవరు? సాతానా? దేవుని సమాధానమా? సమాధానం ఎవరి గుండెల్లో వుంటుందో వారితో దేవుని మందిరం కట్టబడుతుంది. ఆ కట్టబడిన మందిరంలో దేవుని సమాధానం నిలిచి వుంటుంది.

**ప్రభువు నీకు సమాధానమనుగ్రహించును గాక!**

# ఆచార్య ఆరార్కే పాటలు

## అంజలి ఘటియింతు

అంజలి ఘటియింతు దేవా
నీ మంజుల పాదాంబుజముల కడ
నిరంజన మానస పరిమళ
పుష్పాంజలి

పరమాత్మ నీ పాదసేవ
చిరజీవ సంధాన నావ
సిలువ మహాయజ్ఞ సింధూర
రక్త రుణమేయ సంభావనా
ఓ దేవ దేవ యేసుదేవా

అవతార మహిమా ప్రభావా
సువిశాల కరుణా స్వభావా
పరలోక సింహాసనాశీనా
తేజో విరాజ జగదావనా
ఓ దేవ దేవ యేసుదేవా

## చిన్ని పక్షిని

చిన్ని పక్షిని నేను
పంజరంలో ఉన్నాను
పాడుతాను యేసుపాట
పరవశించి పోతాను

రెక్కలున్నా ఎగురలేను
చిక్కిపోతిని యేసు చేతికి
హృదయమనే గగనమును చీల్చుకుని
ఎగసి పోవును పరమపురికి

ఇది చిన్న చెరసాల
ఈ బ్రతుకే ఒక పాఠశాల
యేసుక్రీస్తే నీ ప్రియగురువై
బాసలెన్నో నాకు నేర్పెను

## దేవుని సేవలో సహకరించండి – మా బహుమతి అందుకోండి.

స్పందన మాస పత్రిక మీరు చదవటం ద్వారా మీరూ మీ ఇంటిల్లిపాది ఎంతో దీవించబడుతున్నామని ఎన్నో ఉత్తరాలు ప్రతి నెలా స్పందన ఆఫీసుకు వస్తూవుంటాయి. మీరు స్వీకరిస్తోన్న ఆశీర్వాదాలు మీ స్నేహితులు, బంధువులు స్వీకరించేలా స్పందన వారికి పరిచయం చేయండి. స్పందనను మీరు బహుమతిగా ఇవ్వాలని కోరితే వారి చందా, వారి అడ్రసు మీరు పంపితే మీకు మంచి పాటల సిడి బహుమతిగా పంపిస్తాము.

స్పందన తెప్పించుకుంటారు అనుకున్న వాళ్ల 10 అడ్రసులు మాకు పంపండి. ఈ పాటల సిడిని మీరు స్వంతం చేసుకోండి. *–స్పందన, పోస్టుబాక్స్ 819, విజయవాడ 520004*

బైబిల్ స్టడీ

## బైబిలు మకరందము

# బైబిల్ దేవుని ప్రత్యక్షత

అనువాదం-
ఆచార్య ఆరార్కే మూర్తి,
ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి

### 1. ప్రత్యక్షత అంటే ఏమిటి?

మర్మాన్ని బయలు పరచేదే ప్రత్యక్షం. దేవుడు అదృశ్యుడు, అనంతుడు. తనను తానే మానవునికి ప్రత్యక్షపరుచుకున్నాడు. ఇది దేవుని ప్రత్యేకత. యేసుక్రీస్తు దేవుని మానవ అవతారం. మరోవిధంగా దేవుడు మనిషికి కనబడడు. అలాగే బైబిలు కూడా వ్రాయబడిన దేవుని ప్రత్యక్షం. ద్వితీ 29:29, యోహాను 20:14; రోమా 16:25-27; ఎఫెసీ 3:3-5

2. బైబిలులో దేవుడు తనను బయలుపరుచుకున్నాడు. అనగా యేసు మనకు బయలుపరచబడిన మర్మం.

దేవుడు తన స్వరూపమందు మానవుణ్ని సృజించాడు. ప్రేమతో మానవుణ్ని విమోచించాడు. మానవునికి తనను తాను కనుపరుచుకున్నాడు. లేఖనములు గ్రంథస్తం చేయబడినవి. తరం నుడి తరానికి అందించబడుతూ వచ్చాయి. వీటిని ప్రజలు చదవటం చాలదు, వినాలి గ్రహించాలి. దేవుడు పలికిన మాట అందరూ వినాలి. విశ్వాసులమవ్వాలి. నిర్గమ 24:3,4: ద్వితీ 4:1,2; యెహోషువా 3:9. వాక్యము దేవుని నోటి మాట యెషయా 55:11. తండ్రి తనకు చెప్పిన మాటలే యేసు తన శిష్యులకు చెప్పాడు. యోహాను 17:7,8

3. దేవుడు తన వాక్యమందు మనకు ప్రత్యక్షమయ్యాడు

బైబిలులో ఎన్నో అంశాలున్నాయి. గంభీరమైన ప్రభోధాలు ఉన్నాయి. నీతి విధులు ఉన్నాయి. మానవుని పాప స్వభావాన్ని బట్టబయలు చేస్తాయి. బైబిలులోని ప్రవచనాలు కొన్ని నెరవేరాయి. మరికొన్ని నెరవేరబోతున్నాయి. మానవుడికి దేవుడిచ్చిన ప్రత్యక్షత రాత రూపకంగా మనకు ఇవ్వబడింది. నిత్యత్వమునుండి నిత్యత్వము వరకు దేవుని విమోచన విధానం ఇందులో పొందుపరచబడి ఉంది. బైబిలు గ్రంధకర్త దేవుడే. దేవుడే సర్వజ్ఞుడు. బయలుపరచబడిన మర్మాలు బైబిలులో ఉన్నాయి. యేసు తండ్రి మాటకు తలవొగ్గాడు. లేఖనాలలో ఒక సున్నా పొల్లుకూడా నిరర్ధకం కానేరదని చెప్పాడు. అపోస్తలులు లేఖనాలమీద ఆధారపడి బోధించారు. రోమా 3:1,2; సామెతలు 30:5; రోమా 11:33-36; యోహాను 5:39; 7:16,17; 2రాజులు 10:10.



4.దేవుడు బైబిలులో ఎలా ప్రత్యక్షమవుతాడు?

దేవుడు తన ప్రత్యక్షతను అనుగ్రహించాడు. వాటి ఆధారంగా లేఖనాలు వ్రాయబడ్డాయి. దేవుడు మోషేతో ముఖాముఖాగా మాట్లాడాడు. అవి లేఖనాలు అయ్యాయి. అవి దేవుని ఆజ్ఞలు. నిర్గమ 33:11; ద్వితీ 27:3. ప్రవక్తలకు దేవుడు చెప్పిందంతా గ్రంధస్తం చేశారు. యెషయా 30:8; యిర్మియా 30:2. ప్రవక్తలు ప్రకటించారు. "యెహోవా 1:10-11,24; యిర్మియా 3:11,12; హోషయా 1:1; హగ్గయి 1:1. దేవుడు దర్శనాల ద్వారా తన సందేశాన్ని వ్యక్తం చేశాడు. యెహెజ్కేలు 37:1-3; దానియేలు 7:9,10; ప్రకటన 1:1-2. ఆయా సందర్భాలలో దేవుడు తన దూతల ద్వారా వర్తమానాలు పంపాడు. లూకా 1:26.27; లూకా 2:10,11; హెబ్రీ 2:2. దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా చివరి మాట పలికి తనను తాను ప్రత్యక్షపరచుకున్నాడు. హెబ్రీ 1:1-2. దేవుడు మొదట స్వయంగా దశాజ్ఞలు రాశాడు. నిర్గమ 32:15,16.

5.బైబిలు కొన్ని పేర్లతో పిలువబడుతుంది.

ఎ) వాక్యం: 1 పేతురు 2:2; యాకోబు 1:22; 2 తిమోతి 4:2.

బి) దేవుని వాక్యం: యెషయా 40:8; లూకా 11:28; రోమా 10:17; 1 థెస్స 2:13; హెబ్రీ 4:12

సి) క్రీస్తు వాక్యం: కొలస్సీ 3:16

డి) సత్యవాక్యం: యాకోబు 1:18

ఇ) లేఖనము, పరిశుద్ధ లేఖనములు: మార్కు 12:10; లూకా 4:21; యోహాను 2:2; మత్తయి 22:29; లూకా 24:27; రోమా 1:2; 2తిమోతి 3:15-16

యఫ్) పుస్తకపు చుట్ట: కీర్తనలు 40:7; ప్రకటన 22:19

జి) యెహోవా గ్రంధం: యెషయా 34:16

హెచ్) ధర్మశాస్త్ర గ్రంధము: నెహెమ్యా 8:3; గలతీ 3:10;

ఐ) యెహోవా ధర్మశాస్త్రం: కీర్తన 1:2; యెషయా 30:9

జె) దేవోక్తులు: రోమా 3:2



# వివాహవేదిక

## వధువు కోసం...

1) 27 సం॥రాల వయస్సు, 5'8 ఎత్తు కలిగి B.Tech (Computer Science) చదివి హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్న విశ్వాసియైన వరునకు 26-30 సం॥ వయస్సు, 5'4-5'6 ఎత్తుగలిగి విశ్వాసియైన వదువు కావలెను. ఫోన్ నెం. 040-40036561, 9908190479 **(SVV-F-604)**

## వరుని కోసం...

1) 29 సం॥రాల వయస్సు 5'3" అడుగుల ఎత్తు కలిగి B.Tech (Computer Science) చదివి లండన్‌లో ఉద్యోగం చేస్తున్న విశ్వాసియైన యువతికి 30-32సం॥ వయస్సు, సుమారు 5'5" ఎత్తు కలిగి విశ్వాసియైన వరుడు కావలెను. సంప్ర. నం. 080-25457280, 09886560126 **(SVV-M-271)**

2) 25 సం॥రాల వయస్సు 5'3" అడుగుల ఎత్తు కలిగి M.C.A చదివి Lecturer గా పనిచేయుచున్న క్రిష్టియన్ మాల బి.సి.సి కి చెందిన విశ్వాసియైన యువతికి M.C.A/ B.Tech/ M.Tech చదివి మంచి ఉద్యోగం (ప్రభుత్వ/ప్రవేటు) చేస్తున్న విశ్వాసియైన వరుడు కావలెను. సంప్ర. నం. 9290555559 **(SVV-M-272)**




# బైబిల్‌లోని పేర్లు వాటి అర్థాలు

**ఉజ్జా** = బలము లేదా త్రాణ
1) దేవుని మందసము పట్టుకొని దేవుని చేత మొత్తబడినవాడు – 2 సమూ 6:3,6,7,7; 1 దిన 13ం7,9,11
2) యూదారాజులిద్దరు సమాధిచేయబడిన తోటగలవాడు – 2 రాజు 21:18,26
3) మెరారీ వంశస్థులలో ఒకడు – 1 దిన 6:29,30
4) బెన్యామీను వంశస్థులలో ఒకడు – 1 దిన 8:6
5) జెరుబ్బాబెలుతో కూడ యెరూషలేమునకు తిరిగివచ్చిన ఒక కుటుంబ పితరుడు – ఎజ్రా 2:49; నెహె 7:51

**ఉజ్జీయా** = యెహోవాయే నా బలము.
1) దావీదు పరాక్రమశాలులలో ఒకడు – దిన 11:44
2) యూదా రాజైన అమజ్యా కుమారుడగు ఒక గొప్పరాజు – 2 రాజు 15:13,30,32,34; 2 దిన 26:1,3,8,9,11,14,18,19,21,22,23; 27:2; యెషయా 1:1; 6:1; 7:1; హోషేయా 1:1; ఆమోసు 1:1; జెకర్యా 14:5; మత్తయి 1:8,9
3) కహాతు వంశస్థులలో ఒకడు. 1 దిన 6:24
4) దావీదు బొక్కసములమీద ఉన్న ఒక ఉద్యోగస్థుని తండ్రి. 1 దిన 27:25
5) ఎజ్రా కాలమందు అన్యస్త్రీని వివాహము చేసికొనిన ఒక యాజకుడు. ఎజ్రా 10:21
6) యెరూషలేమునకు తిరిగి వచ్చిన వారిలో ఒకని తండ్రి. నెహెమ్యా 11:4

**ఉజ్జీయేలు** = దేవుడు బలము గలవాడు.
1) కహాతు కుమారులలో ఒకడు. నిర్గమ 6:18,22; లేవి 10:4; సంఖ్యా 3:19,30; 1 దిన 6:2; 15:10; 23:12,20; 24:24
2) షిమ్యోను వంశస్థులలో ఒకడు. 1 దిన 4:42
3) బెన్యామీను వంశస్థులలో ఒకడు. 1 దిన 7:7
4) దావీదు నియమించిన గాయకులలో ఒకడు. హేమాను కుమారులలో ఒకడు. 1 దిన 25:4
5) రాజైన హిజ్కియా యేలుబడిలోని లేవీయులలో ఒకడు. 2 దిన 29:14
6) నెహెమ్యా కాలమందు యెరూషలేము గోడ బాగుచేసిన వారిలో ఒకడు. నెహెమ్యా 3:8

**ఉప్పులోయ** = ఉప్పు, సముద్రపు దక్షిణ దిక్కున ఉన్న ఒక లోయ. 2 సమూ 8:13; 2 రాజు 14:7; 1 దిన 18:12

**ఉఫార్సీన్** = విభాగింపబడినది. సిరియా బాషలోని ఒక పదము. దానియేలు 5:24 వ్రాసిన శాసనమేదనగా మెనే మెనే టేకేల్ ఉఫార్సీన్

**ఊజు** = ఆలోచన లేక స్థిరత్వము.
1) షేము మనుమలలో ఒకడు. ఆది 10:23; 1 దిన 1:17
2) నాహోరు జ్యేష్ఠకుమారుడు. ఆది 22:21
3) ఏశావు వంశస్థులలో ఒకడు. ఆది 36:28; 1 దిన 1:42

**ఊజు** = ఆలోచన లేక స్థిరత. ఎదోము దక్షిణ దేశమందలి ఒక ప్రదేశము. యోబు 1:1; యిర్మీయా 25:20; విలాప 4:21

**ఊర్బాను** = మర్యాదస్థుడు లేదా పురమందలి నివాసి. రోమా పట్టణములో కాపురముండిన ఒక క్రైస్తవ సహోదరుడు. రోమా 16:9

**ఊరి, ఊరు** = కాంతిగలవాడు లేదా నా వెలుగు
1) ప్రత్యక్షపు గుడారము తయారుచేయుటకు నియమింపబడిన బెసలేలు తండ్రి. నిర్గమ 31:2; 35:30; 38:22; 1 దిన 2:20; 2 దిన 1:5
2) సొలొమోను అధిపతులలో ఒకని తండ్రి. 1 రాజు 4:19
3) ఎజ్రా కాలమందు అన్యస్త్రీలను పెండ్లిచేసుకొనిన ద్వారాపాలకులలో ఒకడు. ఎజ్రా 10:24

**ఊరియా** = యెహోవా నాకు వెలుగై ఉన్నాడు.
1) రాజైన దావీదు బలాఢ్యులలో ఒకడు. బత్షెబ భర్త. 2 సమూ 11 (15 సార్లు) 12:9,10; 16:23,38; 1 రాజు 15:4; 1 దిన 11:41
2) యెరూషలేములో కాపురస్థులైన యూదులలో ఒకడు. 1 రాజులు 16:10,11,15,16
3) యెరూషలేము గోడ బాగుచేసిన వారిలో ఒకని తండ్రి. ఎజ్రా 8:33; నెహెమ్యా 3:4,21
4) ఎజ్రా ధర్మశాస్త్రమును చదివినప్పుడు అతనితో కూడా నిలిచినవారిలో ఒకడు. నెహెమ్యా 8:4
5) యెషయా ప్రవచించిన కాలమందలి ఒక యాజకుడు. యెషయా 8:2
6) యిర్మీయా కాలమందు ప్రవచించిన ఒక ప్రవక్త. యిర్మీయా 26:20,21,23

**గమనిక** – ఈ వాక్య భాగాలు మీ బైబిలులో పెన్సిలుతో గుర్తించండి. అర్థాలు రాసుకోండి. వాక్యాన్ని మరింకా బాగా అర్థం చేసుకోవటానికి సాయపడతాయి.

# ప్రార్థన వేదిక

1. **ఆర్.సరోజని - రాజోలు**
   బిడ్డలకు మంచి ఉద్యోగాల కోసం
2. **కె.ప్రిస్కిల్ల - జంగారెడ్డిగూడెం**
   రాజేష్ కుటుంబ జీవితం కోసం
3. **విజయ - నంద్యాల**
   కుడిప్రక్క కిడ్ని(ఫెయిల్) స్వస్థత కోసం
4. **పి.థామస్ - విజయవాడ**
   కోర్టుకేసులో విజయం కోసం
5. **అపొల్లో (4నెలలు) - తెనాలి**
   కంటిచూపు, గుండె సమస్య కోసం
6. **దేవదాసు - ఖమ్మం**
   గుండె వ్యాధినుండి స్వస్థత కోసం
7. **బాబురావు - ఖమ్మం**
   టి.బి వ్యాధినుండి స్వస్థత కోసం
8. **స్వరూపారాణి**
   కుటుంబం జీవితంలో సమస్యలనుండి విడుదల కోసం
9. **ఎ.పుష్పనాదమ్మ - గుంటూరు**
   మనుమరాంధ్ర విద్యలో విజయం కోసం
10. **టి.మోహనరావు - మెదక్**
    భార్య ముగ్గురు బిడ్డల క్షేమం, ఆరోగ్యం కోసం
11. **టి.బాలమ్మ - వేమవరం**
    ఇల్లు అమ్మకం గూర్చి కోసం
12. **యన్.రాజలక్ష్మి**
    దివ్య, రాజా దేవునిలో చక్కగా నిలవబడుట కోసం
13. **పి.రవికుమార్ - నిడదవోలు**
    అమూల్య వివాహం, రవి-ఇందిరలకు సంతానం కోసం
14. **కె.యస్.లలితాభాయి - కడప**
    పరిమళహన్నా వివాహం డిసెంబర్‌లో జయకరంగా జరుగుట కోసం
15. **వై.సామ్యూల్ - విజయవాడ**
    కుటుంబం, సంఘము కోసం
16. **యన్.సత్యనారాయణ - విశాఖపట్నం**
    చిన్నకుమారుని ఉద్యోగం కోసం
17. **బి.జె.యమ్.విజయవాణి - భీమవరం**
    కుటుంబమంతా రక్షింపబడుట కోసం
18. **కె.ప్రభాకర్ - కరీంనగర్**
    కుటుంబ ఆర్థిక, ఆరోగ్య పరిస్థితుల కోసం
19. **డి.శ్రవణ్‌కుమార్ - నంద్యాల**
    అరుణ వివాహం, (శ్రవణ్)బ్యాంకు పరీక్ష కోసం
20. **రాములు - న్యూమోతినగర్**
    జయచందర్, చెన్నకేశవులు మారుమనస్సు కోసం
21. **బి.వి.భూషణం - విశాఖపట్నం**
    కుటుంబం కోసం
22. **డి.సామ్యూల్ - మంగుళూరు**
    కుమారుని వివాహం (విశ్వాసియైన వధువు) కోసం
23. **బి.దశమిబాబు - ఖమ్మం**
    (దశమిబాబు) కుడి మక్కె విరిగినది, స్వస్థత కోసం
24. **వై.శ్యామలరావు - శ్రీకాకుళం**
    బిడ్డల రక్షణ కోసం
25. **యమ్.యేసదయమ్మ - గుంటూరు**
    బిడ్డల కుటుంబముల కోసం
26. **డి.డేవిడ్‌రాజు - విశాఖపట్నం**
    జోషికి పూణేలో ఉద్యోగం కోసం
27. **జె.విమలరాబర్ట్స్ - మదనపల్లి**
    జయంత్‌రాబర్ట్స్(మరణించాడు) కుటుంబం ఆదరణ కోసం
28. **యమ్.నాగమ్మ - విజయవాడ**
    (నాగమ్మ)రిటైర్‌మెంట్, మదుబాబు చిక్కులనుండి విడుదల కోసం
29. **పి.ఆర్.రాజేశ్వరి - భవానిపురం**
    కుటుంబ సమస్యల నుండి విడుదల కోసం
30. **బి.సరోజని బంధం - హుబ్లీ**
    కుమారుల వివాహం కోసం

## జులై గ.ను.క సమాధానాలు

**అడ్డం** 1.నీలము 2.అక్క (తలక్రిందులు) 4.కార్యము 7.ఘనత 8.కానుక 9.పన 10.రుమాలు 13.ప్రవర్తన 16.అతిథి 19.కలహము 20.కొరడా 21.జీవమును(తలక్రిందులు) 23.రాలి 24.రబ్బీ

**నిలువు** 1.నీతి 3.అరికాలు 4.కాటుక 5.ముక్కు 6.పితరుల 7.ఘనము 11.మార్త 12.పనలు 13.ప్రతిష్ట 14.ఎస్తేరు 15.నమ్మకము 17.గేహాజీ 18.పేరట 21.నులి 22.తెర

**సూచనలు:**

1. స్పందనలో ప్రింట్ చేసిన గ.ను.క. లోనే పంపాలి. వేరుగా పంపినవి స్వీకరింపబడవు.

2. పూర్తిచేసిన గ.ను.క. లు **వచ్చేనెల (అక్టోబర్ 15లోపు)** మాకందేటట్లు పంపాలి. ఇతర రాష్ట్రాల్లోని పాఠకుల సౌకర్యార్థం ఈ మార్పు చేశాము. గమనించగలరు.

పూర్తి చేసి పంపిన వారి పేరు.......................

ఊరి పేరు ..........................................

స్పందన కోడ్ నంబరు ..............................

## సెప్టెంబర్ గళ్ళ నుడి కట్టు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ⊗ | 1 | 2 | ⊗ | 3 | | ⊗ |
| 4 | ⊗ | 5 | 6 | | ⊗ | 7 |
| 8 | 9 | ⊗ | | ⊗ | 10 | |
| ⊗ | 11 | | ⊗ | 12 | | ⊗ |
| 13 | | ⊗ | 14 | ⊗ | 15 | 16 |
| | ⊗ | 17 | | 18 | ⊗ | |
| ⊗ | 19 | | ⊗ | 20 | | ⊗ |

## అడ్డం

1. 1 కొరింథి 13 అధ్యాయం శీర్షిక - -

3. - - లేని ఆనందకరమైన నీ ప్రేమ. తరమే వర్ణన సేయను?

5. యేసు వచ్చే - - - ఏమిటో మీకు తెలియదు. మెళుకువగా ఉండండి. మత్తయి

8. 'పాట'ను తలక్రిందులు చేస్తే పోస్టు అవుతుంది. - -

10. ఈమే సిల్లాకు సవతి - -

12. గిలాదులో గుగ్గిలం - - ?ః

13. ఇతనికి కనాను దాసుడు. - -

15. వాగ్ధానము చేయబడిన ఆత్మ యొక్క - - ఎఫెసీ

17. పనివాడు దీనికి పాత్రుడు. - - -

19. సమరయ స్త్రీ యాకోబిచ్చాడట! - -

20. - - నేడు, నిరంతరం యేసు ఒకేరీతిగా ఉన్నాడు.

## నిలువు

2. ఆడ కాదు సృష్టిలో రెండో సగం. - -

3. సహోదర ప్రేమలో దీన్ని అమర్చుకోవాలి 2 పేతురు

4. యేసే నా - - కొండ.

6. యూనివర్సిటి ఫ్యాక్టరీలలో ఇవి ఉత్పత్తి అవుతాయి! - -

7. ఇదిగో నేను - - కాలము మీతో కూడా వున్నాను.

9. దీనికి దీపం వాక్యమే. - - -

10. ప్రథమ మానవుడు. - - -

13. హెబెలుకు ప్రతిగా హవ్వకు దేవుడిచ్చిన సంతానం. - -

14. దేవుడు - - చేస్తే, మనిషి వేరు చేయకూడదు.

16. "ఉప"తో చేరిన నీరు ప్రమాదం. - -

17. దేవుని సింహాసనం ఎదుట నిలిచిన - - ప్రకటన

18. "- - కోలలకు ఎదురు తన్నుట అసాధ్యము.

# ప॥ గో॥ జిల్లా నరసన్నపాలెంలో 'బెతెస్థ'లో జరిగిన ఆచార్య ఆరార్కే గారి జ్ఞాపకార్థ సభ



సందేశం - డా॥దేవ, హాజరైన ప్రజలలో కొంతభాగం



నివాళి - పా॥బాబుగారు, రెవ.రవికుమార్‌గారు, పా॥షాలేంగారు. గానాలు - పా॥దియ్య, పా॥పాదాలు, పా॥జి.యస్.రావు



పా॥బాబుగారితో డా॥దేవ బృందం, డా॥దేవ ప్రార్థనలు, పా॥పీటర్‌గారి కుటుంబంతో డా॥దేవ

## అనాధ, పేద పిల్లలకు ఆశ్రయము

# లిటిల్ ఏంజల్స్ హోమ్



శ్రేష్ఠమైన ఈ చిన్న బిడ్డల
పరిచర్యకోసం
ప్రార్థించండి
ప్రభువు మిమ్మును ప్రేరేపిస్తే
ఒక బిడ్డకు అయ్యే
ఖర్చును మీరు
ప్రతి నెల పంపవచ్చును

గమనిక :
చెక్కులు, డ్రాఫ్టులు
పంపేవారు స్పందన
SPANDANA పేరు
మీద మాత్రమేపంపమనవి



పిల్లలను... వారి ఇబ్బందిలో పరామర్శించుటయే నిజమైన భక్తి. (యాకోబు 1:27)

వివరాలకు : లిటిల్ ఏంజల్ హోమ్ ఫోన్ : 9490113300

స్పందన, పోస్ట్‌బాక్స్ 815, ESI హాస్పటల్ రోడ్, గుణదల, విజయవాడ - 520 004

RNI No: 32106/76 Regd No. VJ/057/2009-11
Licenced to post without pre-payment No. PMG/VJ/PWPP/21/2009-11





# నూతన ప్రార్థన మందిర నిర్మాణం

దేవుని మహాకృపలో విజయవాడ, గుణదలలో ప్రారంభించిన ప్రార్థనా మందిరము, అనాథలు, పేదలయిన పిల్లలకు నివాసము, దైవసేవకుని నివాసము కోసం మూడు అంతస్తులుగా ప్రారంభించిన పని దిన దినమూ అభివృద్ధి చెందుతున్నది. కేవలం విశ్వాసంతో ప్రారంభించిన ఈ పనికి దేవుని బిడ్డలయిన వారు ఆర్థికంగా సహకరిస్తున్నారు. ఏలియాకు కాకులతో ఆహారం దేవుడు పంపినట్టు ఈ పనికి కావలసిన ఆర్థిక సహాకారాన్ని కూడా దేవుడు సాయం చేస్తున్నాడు. ఈ బిల్డింగ్‌కు కావలసిన డబ్బును పరిచర్యల బ్యాంక్‌లో బ్యాలెన్స్ ఉండి ప్రారంభించలేదు. ఏమీ లేనప్పుడు విశ్వాసంతో ప్రారంభించాము. కారణం దేవుని వాగ్దానములు.

ప్రియ దేవుని బిడ్డలారా మీరూ ప్రార్థించండి. స్పందన ఆధ్యాత్మిక మాస పత్రిక సభ్యులు వేలకొలది ఉన్నారు. ఒక్కొకరు కనీసం 500 లేదా 1000 పంపినా ఈ నిర్మాణం త్వరగా పూర్తి అవుతుంది. మీలో ప్రతిఒక్కరూ ప్రార్థించాలని, సహకరించాలని ప్రభువు నామమున మీకు మనవి చేస్తున్నాము. మీరు పంపే ఎంత పెద్ద మొత్తమయినా, చిన్ని కానుక అయినా దేవుని దృష్టిలో అది ఎంతో విలువగలదని గుర్తించాలని మనవి.

మరిన్ని వివరాలకు

స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక, డా॥దేవసహాయం దండల
ఇ.యస్.ఐ.హాస్పటల్ రోడ్, గుణదల, విజయవాడ - 520004
ఫోన్స్: 9490113300, 0866-2456547 డా॥దేవ పర్సనల్ ఫోన్: 9948335222

## ప్రత్యేక గమనిక

ఇతర రాష్ట్రాల్లో, దేశాల్లో ఉన్న పాఠకుల కోరిక మేరకు ఆరార్కే గారితో మీకున్న ఆధ్యాత్మిక అనుభవాలు, దైవజనునితో మీరు తీయించుకున్న ఫోటోలు పంపడానికి మరికొంత సమయం తీసుకుంటున్నాము. ప్రభువు చిత్తప్రకారం అక్టోబర్ నెల సంచిక ఆరార్కే గారికి నివాళి ప్రత్యేక సంచికగా ప్రచురించనున్నాము. గేయాలు, కవితలు, మీ అనుభవాలు వెంటనే వ్రాసి పంపాలని మనవి.